
# మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A4284

www.manananationalistvoice.com    epaper.manananationalistvoice.com








ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 130 | 06 సోమవారం, ఏప్రిల్ 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం


## అమెరికా రెస్క్యూ ఆపరేషన్ విఫలం చేశాం...

### - ఓ విమానం, రెండు హెలికాప్టర్లను కూల్చేశాం: ఇరాన్

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)



తమ భూభాగంలో అమెరికా చేపట్టిన ఓ రెస్క్యూ ఆపరేషన్‌ను విఫలం చేశామని ఇరాన్ ప్రకటిం చింది. ఈ ఆపరేషన్ సందర్భంగా ఒక సీ-130 రవాణా విమానంతో పాటు రెండు బ్లాక్ హాక్ హెలి కాప్టర్లను కూల్చివేసినట్లు ఇరాన్ రివో ల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) సంచ లన ప్రకటన చేసింది. అమె రికా చేపట్టిన ఈ చర్య పూర్తిగా విఫల మైందని ఇరాన్ సైనిక కమాండ్ పేర్కొంది. ఈ ఆపరేషన్‌లో ఐదుగురు మరణించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది.

- మిగతా 2 లో..

## కవిత కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరు?..

### - తెలంగాణ రాజకీయాల్లో పెను ప్రకంపనలు!



(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన కొత్త పార్టీ ఏర్పాటు ప్రయత్నాల్లో వేగం పెంచారు. ఈ నెల 25వ తేదీన పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ఆమె, దానికి 'తెలంగాణ రాష్ట్ర సమితి' (టీఆర్ఎస్) పేరును పరిశీలిస్తున్నట్లు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. "పాత పేరు, కొత్త జెండా, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తాను" అని ఆమె చెప్పడం ఈ చర్చకు మరింత బలాన్నిచ్చింది. దీంతో తెలంగాణ ఉద్యమంతో ముడిపడిన పేరును కవిత సొంతం చేసుకోబోతున్నారా? అనే ఉత్కంఠ నెలకొంది.కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ పార్టీ, 'భారత రాష్ట్ర సమితి' (బీఆర్ఎస్)గా మారడంతో ప్రస్తుతం టీఆర్ఎస్ పేరు ఎవరైనా వాడుకోవచ్చని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్‌తో పాటు టీఆర్ఎస్ పేరుతో ముడిపడిన భావోద్వేగాలను తనవైపు తిప్పుకోవాలనేది ఆమె వ్యూహంగా కనిపిస్తోంది. అయితే, పార్టీ పేరు టీఆర్ఎస్ అయినా జెండాలో మాత్రం గులాబీ రంగు ఉండదని ఆమె స్పష్టం చేశారు. - మిగతా 2 లో..

## ఇరాన్‌లో రికార్డు స్థాయి ఇంటర్నెట్ షట్‌డౌన్...

### - ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు కట్!

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

టెహ్రాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సం యుక్తంగా సైనిక దాడులు ప్రారం భించిన తర్వాత ఇరాన్‌లో విధించిన దేశవ్యాప్త ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్ ఐదో వారంలోకి ప్రవేశించింది. ఇది ఇప్పటివరకు ప్రపంచంలోనే అత్యం త సుదీర్ఘమైన జాతీయ స్థాయి ఇంటర్నెట్ షట్‌డౌన్‌గా రికార్డు సృష్టించిందని డిజిటల్ మానిటరింగ్ సంస్థ 'నెట్‌బ్లాక్స్' ఆదివారం వెల్లడించింది.

- మిగతా 2 లో..





## రాజేంద్రనగర్‌లో తెలంగాణ కొత్త హైకోర్టు...

### - శంకుస్థాపన చేసిన సీజేఐ

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)


తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్-2 భవన నిర్మాణానికి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఆదివారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హాజరయ్యారు. ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ అంకురార్పణ కార్యక్రమం తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేకమైన రోజు అని ముఖ్యమంత్రి అభివర్ణించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ, ఒక కోర్టు సముదాయాన్ని నిర్మించడం అంటే కులమతాలకు అతీతంగా ప్రజల కోసం ఒక పవిత్ర స్థలాన్ని నిర్మించడమేనని అన్నారు."ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులకు చివరి ఆశ, నమ్మకం న్యాయస్థానమే. అటువంటి న్యాయస్థానాన్ని నిర్మించే అవకాశం మా ప్రభుత్వానికి రావడం అదృష్టంగా భావిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

- మిగతా 2 లో..

## టి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

### - ప్రకటించిన సీఎం చంద్రబాబు

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)



రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా నేడు రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, రాబోయే 100 రోజుల ప్రణాళికపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా, సీఎం చంద్రబాబు రేపు (ఏప్రిల్ 6) తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

**100 రోజుల కార్యాచరణ.. సాగునీటి సంఘాలకు కీలక బాధ్యతలు**

నీటి భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

- మిగతా 2 లో..

## భారత్ దాడి చేస్తే ఊరుకోం..

### - కోల్‌కతాపై విరుచుకుపడతామన్న పాక్ మంత్రి

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)



తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కుదేల వుతూ, ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలతో సతమతమవుతున్న పాకి స్థాన్, మరోసారి భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కింది. భవిష్యత్తులో భారత్ తమపై ఎలాంటి సైనిక చర్యకు పాల్పడినా, ఈసారి కోల్‌కతా నగరాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ చేసిన ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచాయి."ఈసారి కూడా మమ్మల్ని బాధ్యులను చేసి, భారత్ ఏదైనా సైనిక చర్యకు దిగితే, మా తదుపరి లక్ష్యం కోల్‌కతానే అవుతుంది" అని ఆసిఫ్ స్పష్టం చేశారు. అంతేగాక భారత్ ఒక 'ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్' కోసం ప్రణాళికలు రచిస్తున్నట్లు తమ వద్ద నివేదికలు ఉన్నాయని ఆయన ఆరోపించారు.

- మిగతా 2 లో..

## ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి...

### - అమిత్ షాకు మంత్రి తుమ్మల లేఖ

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)




భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. పాలనా సౌలభ్యం, స్థానిక గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ విలీనం అత్యవసరమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల వివరించారు. ఈ గ్రామాలను భద్రాచలంలో విలీనం చేయడం ద్వారా గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు.స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి, సానుకూలంగా స్పందించాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## మా వాడిని రక్షించాం..

### - అమెరికా సైనిక చరిత్రలోనే సాహసోపేతమైన రెస్క్యూ: ట్రంప్

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)



ఇరాన్‌లో కూలిపోయిన అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్‌లోని రెండో పైలట్‌ను కూడా విజయవంతంగా రక్షించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. అమెరికా సైనిక చరిత్రలోనే ఇది అత్యంత సాహసో పేతమైన సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లలో ఒకటని ఆయన అభివర్ణించారు.దాదాపు రెండు రోజులుగా గల్లంతైన ఈ పైలట్‌ను శత్రు భూభాగంలో తీవ్ర పోరాటం అనంతరం గుర్తించి రక్షించినట్లు అంతకుముందు అల్ జజీరా కథనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.

- మిగతా 2 లో..

# మా వాడిని రక్షించాం..

మొదటిపేజీ తరువాయి

"మా వాడిని రక్షించాం! అమెరికా సైన్యం అత్యంత సాహసోపేతమైన ఆపరేషన్ నిర్వహించి, మన అధికారిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చింది. ఆయన సురక్షితంగా, క్షేమంగా ఉన్నారని చెప్పడానికి సంతోషిస్తున్నాను" అని ట్రంప్ పోస్ట్ చేశారు."ఇరాన్‌లోని ప్రమాదకరమైన పర్వత ప్రాంతాల్లో శత్రువులు అతడిని వేటాడుతుండగా, గంటగంటకు వారు సమీపిస్తున్నా.. మా సైనికాధికారులు 24 గంటలూ అతడిని పర్యవేక్షిస్తూనే ఉన్నారు. నా ఆదేశాల మేరకు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఆయుధాలతో కూడిన డజన్ల కొద్దీ విమానాలను పంపి ఆయన్ను కాపాడాం. ఆయనకు గాయాలయ్యాయి. కానీ, త్వరలోనే కోలుకుంటారు" అని ట్రంప్ వివరించారు.కొన్ని రోజుల క్రితం జెట్ కూలిపోగా, ఒక పైలట్‌ను వెంటనే రక్షించారు. అయితే, రెండో పైలట్‌ను రెస్క్యూ ఆపరేషన్‌కు ప్రమాదం కలగకూడదనే ఉద్దేశంతో ఆ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు ట్రంప్ తెలిపారు. శత్రు భూభాగంలో ఇద్దరు పైలట్లను వేర్వేరుగా, సురక్షితంగా కాపాడటం సైనిక చరిత్రలో ఇదే మొదటిసారని ఆయన అన్నారు. ఈ ఆపరేషన్‌లో ఒక్క అమెరికన్ సైనికుడికి కూడా హాని జరగలేదని, ఇది ఇరాన్ గగనతలంపై అమెరికా ఆధిపత్యాన్ని రుజువు చేస్తోందని పేర్కొన్నారు.మరోవైపు మధ్య ఇరాన్‌లోని కోగిలుయే అండ్ బోయర్-అహ్మద్ ప్రావిన్స్‌లో ఈ విమానం కూలిపోయినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. గల్లంతైన పైలట్ ఆచూకీ తెలిపిన వారికి ఇరాన్ ప్రభుత్వం 60,000 డాలర్ల రివార్డు కూడా ప్రకటించిన నేపథ్యంలో అమెరికా ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను పూర్తి చేయడం గమనార్హం.

# టి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకటించిన సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తూ వారికి కీలక బాధ్యతలు అప్పగించారు. "ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి, ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి, భూగర్భ జలాలను పెంచాలి" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇరిగేషన్, అటవీ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశు సంవర్థక శాఖలు సమన్వయంతో పనిచేసి సాగునీటి సంఘాలకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నీటి భద్రతను సాధిస్తే మిగిలిన అన్ని రంగాల్లో అభివృద్ధి దానంతట అదే సాధ్యమవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

### పక్కా ప్రణాళికతో పనులు.. జులై 14 డెడ్‌లైన్

ఈ 100 రోజుల కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో అమలు చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్‌ను ప్రకటించింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రణాళికను రూపొందించారు.ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 వరకు: చేపట్టాల్సిన పనుల గుర్తింపు.ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 20 వరకు: గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతుల మంజూరు.ఏప్రిల్ 21 నుంచి జూలై 9 వరకు: క్షేత్రస్థాయిలో పనుల అమలు.జూలై 10 నుంచి జూలై 14 వరకు: పూర్తి చేసిన పనులపై నివేదికల సమర్పణ.ఈ షెడ్యూల్ ప్రకారం 'మిషన్ అప్రోచ్'తో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సీఎం అధికారులకు, సాగునీటి సంఘాల సభ్యులకు సూచించారు.

### అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో.. భూగర్భ జలాల పెంపే లక్ష్యం

నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపులో అన్నమయ్య జిల్లా సాధించిన ప్రగతిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. 'జలధార' పేరుతో ఆ జిల్లాలో చేపట్టిన చర్యలు అద్భుత ఫలితాలనిచ్చాయని, స్థానిక జలవనరులను వినియోగించుకుని, చెరువులను నింపి భూగర్భ జలాలను గణనీయంగా పెంచారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున 8.7 మీటర్ల లోతున ఉన్న భూగర్భ జలాలను, కనీసం 1.5 మీటర్ల మేర పైకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

### పూడికతీత నుంచి వాటర్ బడ్జెట్ వరకు.. చేయాల్సిన పనులివే

ఈ 100 రోజుల్లో చేపట్టాల్సిన పనులపై సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫీడర్ ఛానెళ్లను శుభ్రం చేయడం, చెరువులు, కాల్వల్లో పూడిక తీయడం, గుర్రపు డెక్కను తొలగించడం వంటి పనులను వెంటనే చేపట్టాలన్నారు. దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, వరద ముంపును కూడా అరికట్టవచ్చని తెలిపారు. అవసరమైన చోట చెక్ డ్యాంలకు మరమ్మతులు చేయడం, కొత్త నిర్మాణాలు చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా, ప్రతి సాగునీటి సంఘం తమ పరిధిలో 'వాటర్ బడ్జెట్' తయారు చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యత, అవసరాలపై స్పష్టమైన అంచనాతో ముందుకు సాగాలన్నారు. నీటి వృధాను అరికట్టేందుకు మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని కోరారు.

### కరవు రహిత రాష్ట్రమే ధ్యేయం.. ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి

కొద్దిపాటి శ్రద్ధ పెడితే రాష్ట్రంలో నీటి సమస్యను అధిగమించి, కరవు రహిత రాష్ట్రంగా మార్చవచ్చని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాయలసీమ ఎడారి అవుతుందని అన్నారని, కానీ నేడు హార్టీకల్చర్ హబ్‌గా మారిందని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులతో పాటు, నేడు పోలవరం సహా పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు. గతేడాది (2024 మే నుంచి 2025 మే వరకు) ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు 2.20 మీటర్ల మేర పెరిగాయని, అంటే సుమారు 200 టీఎంసీల నీటిని అదనంగా భూమిలో ఇంకించగలిగామని తెలిపారు. అదే స్ఫూర్తితో ఈ 100 రోజుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కవిత కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరు?..

మొదటిపేజీ తరువాయి

పార్టీ రిజిస్ట్రేషన్ కోసం తెలంగాణ జాగృతి బృందం ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం వద్ద 'తెలంగాణ ప్రజా జాగృతి పార్టీ' పేరుతో ప్రక్రియ ప్రారంభించింది.తమకు ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీ అని కవిత ప్రకటించారు. అదే సమయంలో బీఆర్ఎస్‌ను 'ధనిక పార్టీ'గా ఆమె అభివర్ణించారు. పార్టీ ఆవిర్భావం రోజున అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి, ఉద్యమకారులతో కలిసి వేదికను పంచుకుంటామని తెలిపారు. డీఎస్పీ విశారదన్ మహారాజ్‌తో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో సిద్దిపేట లేదా గజ్వేల్‌లో మహిళా రిజర్వేషన్లు అమలైతే అక్కడి నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కవిత సూచనప్రాయంగా తెలిపారు. ఆడబిడ్డకు ఓటేయడం అనేది ఒక ఎమోషన్ అని వ్యాఖ్యానించారు.ఢిల్లీ మద్యం కేసు కొట్టివేతను ఉద్దేశిస్తూ.. "అదృష్టవంతుడిని ఎవరూ ఆపలేరు, ప్రకృతి నాకు సహకరిస్తోంది" అని ఆమె అన్నారు. భగవద్గీతలో ఉన్న నీతి ప్రకారం యుద్ధం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఇదే సమయంలో చంద్రబాబు నాయుడు కష్టపడి పనిచేస్తారని, పార్టీ నిర్మాణంలో టీడీపీ చాలా బలంగా ఉంటుందని ప్రశంసించడం గమనార్హం.

# భారత్ దాడి చేస్తే ఊరుకోం..

మొదటిపేజీ తరువాయి

"భారత్ తమ సొంత ప్రజలతో గానీ, లేదా పాకిస్థానీలతో గానీ ఒక నకిలీ దాడి చేయించి, కొన్ని మృతదేహాలను ఎక్కడో పడేసి, వారు ఉగ్రవాదులని, ఈ దాడికి పాల్పడ్డారని ప్రచారం చేసే అవకాశం ఉంది" అని ఆయన అన్నారు. అయితే, తన ఆరోపణలకు మద్దతుగా ఖవాజా ఆసిఫ్ ఎలాంటి ఆధారాలూ చూపించలేకపోయారు. భారత్ నుంచి ఎలాంటి దాడి జరిగినా తమ స్పందన వేగంగా, పక్కా ప్రణాళికతో, నిర్ణయాత్మకంగా ఉంటుందని ఆయన గురువారం కూడా వ్యాఖ్యానించారు.ఖవాజా ఆసిఫ్ చేసిన ఈ వ్యాఖ్యలు, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన మునుపటి హెచ్చరికలకు ప్రతిస్పందనగా భావిస్తున్నారు. పొరుగు దేశం ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా, మునుపెన్నడూ లేనివిధంగా నిర్ణయాత్మకమైన జవాబు ఉంటుందని రాజ్‌నాథ్ సింగ్ గతంలో పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించారు. గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ రక్షణ మంత్రి చేసిన తాజా వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య మాటల యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేశాయి.

# తీవ్ర ఉద్రిక్తతల నడుమ హర్మ్యూజ్ దాటిన మరో భారత నౌక 'గ్రీన్ ఆశా'

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా భారత నౌకల రాకపోకలు నిరంతరాయంగా సాగుతున్నాయి. తాజాగా 'గ్రీన్ ఆశా' అనే భారత జెండాతో కూడిన ఎల్పీజీ నౌక ఈ జలసంధిని సురక్షితంగా దాటింది. ఈ ప్రాంతంలో సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఈ కీలక సముద్ర మార్గాన్ని దాటిన తొమ్మిదో భారత ట్యాంకర్ ఇదే కావడం గమనార్హం.ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ ఈ జలసంధిపై పట్టు బిగించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన ఈ మార్గంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి. అయినప్పటికీ, ఇంధన అవసరాల దృష్ట్యా భారత్ ఈ మార్గంపైనే ఆధారపడుతోంది.గ్రీన్ ఆశా కంటే ముందు కూడా అనేక భారత నౌకలు ఈ ప్రాంతాన్ని విజయవంతంగా దాటాయి. బీడబ్ల్యూ టైర్, బీడబ్ల్యూ ఎల్మ్ అనే రెండు ఎల్పీజీ నౌకలు సుమారు 94,000 టన్నుల కార్గోను రవాణా చేశాయి. మార్చి నెలలో ఎంటీ శివాలిక్, ఎంటీ నందా దేవి అనే ట్యాంకర్లు 92,700 టన్నుల ఎల్పీజీని గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టులకు చేర్చాయి.వీటితో పాటు, ముడి చమురు, ఇతర ఇంధనాలను కూడా భారత నౌకలు రవాణా చేస్తున్నాయి. 'జగ్ లాడ్కి' అనే ఆయిల్ ట్యాంకర్ యూఏఈ నుంచి 80,000 టన్నుల ముడి చమురును ముంద్రా పోర్టుకు తీసుకురాగా, 'జగ్ ప్రకాశ్' నౌక ఒమన్ నుంచి ఆఫ్రికా మార్కెట్లకు గ్యాసోలిన్‌ను చేరవేసింది. దేశీయ ఇంధన భద్రత కోసం ఈ ప్రమాదకర మార్గంలో ప్రయాణం తప్పడం లేదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# రాజేంద్రనగర్‌లో తెలంగాణ కొత్త హైకోర్టు...

మొదటిపేజీ తరువాయి

ఈ కొత్త హైకోర్టు భవనం ప్రజాస్వామ్యానికి ఒక ప్రతీకగా నిలుస్తుందని, న్యాయం కోసం వచ్చే పేదలు, బలహీనులకు భరోసా ఇస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2027 డిసెంబర్ నాటికి ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం స్పష్టం చేశారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ ఎస్.వి. భట్టి, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్‌లో రికార్డు స్థాయి ఇంటర్నెట్ షట్‌డౌన్...

మొదటిపేజీ తరువాయి

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో నెట్‌బ్లాక్స్ చేసిన పోస్ట్ ప్రకారం, ఈ షట్‌డౌన్ వరుసగా 37 రోజులుగా (864 గంటలకు పైగా) కొనసాగుతోంది. ఇంతటి తీవ్రతతో, ఇంత సుదీర్ఘకాలం పాటు కొనసాగిన ఘటన చరిత్రలో ఇదే మొదటిదని పేర్కొంది. గతంలో మయన్మార్, సూడాన్, కశ్మీర్ వంటి ప్రాంతాల్లో అంతరాయాలతో కూడిన లేదా ప్రాంతీయ షట్‌డౌన్‌లు ఉన్నప్పటికీ, సాధారణ ఇంటర్నెట్ సదుపాయం ఉన్న ఒక దేశం ఇంతకాలం పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఉండటం ఇదే తొలిసారి.ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ బ్లాక్‌అవుట్‌తో ఇరాన్ ప్రజలు ప్రపంచ ఇంటర్నెట్‌కు పూర్తిగా దూరమయ్యారు. ప్రభుత్వం ఎంపిక చేసిన వారికి మాత్రమే యాక్సెస్ ఇచ్చే 'వైట్‌లిస్టింగ్' విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతరం ఇరాన్‌లోని లక్ష్యాలపై క్షిపణి, డ్రోన్ దాడులు చేస్తుండగా, ఇరాన్ కూడా పొరుగున ఉన్న గల్ఫ్ దేశాల్లోని వారి స్థావరాలపై ప్రతీకార దాడులకు దిగుతోంది.ఈ ఘర్షణల నేపథ్యంలో, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలైన వీపీఎన్ (వ్యూచీ), శాటిలైట్ కనెక్షన్లను కూడా ఉపయోగించకుండా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించకపోవడంతో, ఇంటర్నెట్‌ను ఎప్పుడు పునరుద్ధరిస్తారనే దానిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు.

# అమెరికా రెస్క్యూ ఆపరేషన్ విఫలం చేశాం...

మొదటిపేజీ తరువాయి

అయితే, ఈ ఆపరేషన్ చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైందని, తమ పైలట్‌ను విజయవంతంగా రక్షించుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. గత శుక్రవారం ఇరాన్ కూల్చివేసిన తమ ఎఫ్-15ఈ యుద్ధ విమానంలో తప్పిపోయిన రెండో పైలట్‌ను (కల్నల్ ర్యాంక్ అధికారి) సురక్షితంగా కాపాడినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో ఒక్క అమెరికా సైనికుడు కూడా గాయపడలేదని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో పేర్కొన్నారు.శుక్రవారం నాడు మధ్య ఇరాన్‌లో అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ యుద్ధ విమానం కూలిపోయింది. అందులోని ఇద్దరు పైలట్లలో ఒకరిని వెంటనే రక్షించగా, రెండో పైలట్ కోసం అమెరికా ప్రత్యేక దళాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే అమెరికా విమానాలను కూల్చివేశామని ఇరాన్ చెబుతోంది. ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో శత్రు విమానాలు మంటల్లో కాలిపోతున్నాయని ఇరాన్ అధికార ప్రతినిధి తెలిపారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఓ డ్రోన్‌ను కూడా కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది.ఈ పరస్పర విరుద్ధ ప్రకటనలతో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇదే సమయంలో మరో అమెరికా యుద్ధ విమానం ఏ-10ను కూడా కూల్చినట్లు వార్తలు వస్తుండటం గమనార్హం.

# అమెరికా విమానాన్ని కూల్చేశాం.. త్వరలో ఒక 'బిగ్

(నేషనలిస్ట్ వాయిస్)

అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికాకు చెందిన సీ-130 రవాణా విమానాన్ని తాము కూల్చివేసినట్లు ఆదివారం వెల్లడించింది. చిక్కుకుపోయిన ఒక అమెరికన్ సైనికుడిని గుర్తించేందుకు యూఎస్ చేపట్టిన ఆపరేషన్ సందర్భంగా ఈ ఘటన జరిగిందని పేర్కొంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా గగనతలంలోకి వచ్చిన పలు "ఫ్లయింగ్ ఆబ్జెక్ట్స్"ను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపింది.ఫార్స్ న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం ఒక ఇరాన్ అధికారి మాట్లాడుతూ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "అమెరికాకు, దాని మిత్రపక్షాలకు మా వద్ద ఒక పెద్ద సర్‌ప్రైజ్ ఉంది. దానికి ఎంతో సమయం పట్టదు. దక్షిణ ఇరాన్‌లో వారి ప్రవర్తనను బట్టి మా ప్రణాళికల సమయాన్ని మరింత ముందుకు జరిపే అవకాశం ఉంది" అని ఆయన హెచ్చరించారు. అమెరికా సైనిక ఆపరేషన్లు విఫలమయ్యాయని, వారి టార్గెట్ కచ్చితమైంది కాదని ఎద్దేవా చేశారు."అసమాన యుద్ధ తంత్రంలో శత్రువును ఎలా బలహీనపరచాలో మాకు బాగా తెలుసు. సులభంగా, వేగంగా దాడి చేయాలనే అమెరికా వ్యూహం విఫలమైంది" అని ఆ అధికారి వ్యాఖ్యానించారు.ఇదే సమయంలో అబుదాబిలోని బోరూజ్ పెట్రోకెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గగనతలంలో దాడులను విజయవంతంగా అడ్డుకున్న తర్వాత, వాటి శకలాలు ఫ్యాక్టరీపై పడటంతో మంటలు చెలరేగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఘటనతో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం మరింత తీవ్రమైంది.

# రోడ్డుకు ఇరువైపులా డబ్బా దుకాణాలు

-డ్రైనేజీలపై ఏర్పాటు.. మురుగును శుభ్రం చేసేదెలా...-పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి రామాలయం వరకు ఆక్రమణల పర్వం
-ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకునేది ఎవరు -ప్రాణాలు పోతేనే స్పందిస్తారా అంటూ అసహనం





**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 5(నేషనలిస్ట్ వాయిస్):**

కొత్తగూడెం పట్టణంలోని పలు ప్రాంతాలలో వ్యాపారం ముసుగులో కొందరు స్థలాలను ఆక్రమించి దందాను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి బాబు క్యాంప్ క్యాంపు రామాలయం వరకు వ్యాపారం పేరుతో అక్రమంగా డబ్బా కొట్లను అమర్చుకొని వాటిని కొందరు అద్దెకిస్తూ దోచు కుంటున్నారు. ఇటీవల కాలంలో పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ చెందిన ఖాళీ స్థలం పక్కనే డబ్బా కొట్టులను పెట్టుకొని దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పైగా కొందరు డ్రైనేజీల పైనే డబ్బా కోట్లను పెట్టి తమ వ్యాపార సామ్రాజ్యాన్ని పెంచుకుంటున్న పరిస్థితి నెలకొంది. డ్రైనేజీల మీద ఏర్పాటు చేస్తే మురుగునీటిని ఎలా క్లీన్ చేస్తారంటూ కొందరు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రోడ్డు అంచుల పక్కనే డబ్బా కోట్లను పెట్టి వ్యాపారం చేస్తుండడం వల్ల కొన్ని సందర్భాలలో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా వాహనదారులు సైతం ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం పట్ల వ్యాపారం పేరుతో మరికొందరు డబ్బాకోట్లను తయారు చేసుకొని నేరుగా రోడ్డు పక్కన డ్రైనేజీల పైన పెట్టి ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకి ఇరువైపులా ఏర్పాటుచేసిన అక్రమ దుకాణాలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలుగకుండా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు






# విద్యార్థులకు క్రమశిక్షణను అలవర్చాలి

-మేయర్ మూడు గణేష్
-తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది కావాలి
-మండల విద్యాశాఖ అధికారి మధురవాణి
-మోడ్రన్ ఇఖ్రా స్కూల్ లో ఘనంగా వారికోత్సోవ వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 5(నేషనలిస్ట్ వాయిస్):**

నేటి బాలలే రేపటి భవితకు మార్గదర్శకులని వారికి చదువుతో పాటు చక్కని సంస్కారం నైతిక విలువలకు నేర్పాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 14వ వార్డు సుభాష్ చంద్రబోస్ నగర్ రామవరం లోని మోడ్రన్ ఇఖ్రా పాఠశాలలో ఆదివారం జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. చదువు కేవలం సంపాదన కోసం కారాదన్నారు. చదువుతో పాటు సమాజం పట్ల అవగాహన కలిగి జీవించేలా తీర్చిదిద్దాలని అన్నారు.మండల విద్యాశాఖ అధికారిని మధురవాణి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాలల కన్నా రెట్టింపు బాద్యత తల్లితండ్రులదని అన్నారు. కొత్తగూడెం జిల్లా కమ్యూనిష్ట్ పార్టీ కార్యదర్శి సాబీర్ పాష మాట్లాడూతూ విద్య వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో మోడ్రన్ ఇఖ్రా పాఠశాలలో అందరీ అందుబాటులో ఉన్న ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్న మోడ్రన్ ఇఖ్రా యాజమాన్యాన్ని అభినందించారు. మొక్కల వెంకటయ్య మాట్లాడుతూ పచ్చని ఆహ్లాదకరమైన వాతవర్ణంలో నైతిక విలువలతో కూడిన విద్యకు పెట్టింది పేరు మోడ్రన్ ఇఖ్రా పాఠశాల అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా విద్యార్థులు ప్రధర్శించిన చదువి విలువ తెలుపుతూ స్వచ్ఛ భారతం రైతులే దేశానికి వెన్నెముక కాలం విలువ తెలుసుకో అన్న ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కర్సపాండెంట్ అబ్దుల్ బాసిత్, ప్రధానో పాధ్యాయురాలు పర్వీన్ సుల్తాన, వార్డు కౌన్సిలర్ కూరపాటి సుదాకర్, టిచర్లు లక్ష్మి ప్రసన్న, శీరిషా, సల్మా, విజయ లక్ష్మి, లతీఫా, సరస్వతీ, అనితా, నుసరత్, సల్మా జబీన్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.




# మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలి
## జిల్లా కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 5(నేషనలిస్ట్ వాయిస్):**

మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. భద్రాద్రి జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా కలెక్టర్ అంకిత్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో సుదీర్ఘకాలం విశిష్ట సేవలు అందించి సామాజిక న్యాయ సాధనకు కృషి చేసిన మహానేత అని కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ ఉన్నత స్థాయికి ఎదగాలంటే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలో అనేక శాఖలకు మంత్రిగా సేవలందించడమే కాకుండా దేశ ఉప ప్రధానిగా కూడా సమర్థవంతంగా పనిచేసి ప్రజాసేవకు అంకితభావంతో నిలిచారని తెలిపారు. మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో వివక్ష లేకుండా సమానత్వంతో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణు గోపాల్, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ నాయకులు సాబీర్ పాషా, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం.శ్రీలత, జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ దాసరి శ్రీనివాస్, కో-కన్వీనర్లు చదలవాడ సూరి, కూసపాటి శ్రీనివాస్, మంద హనుమంతు, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, మద్దెల సూరి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ క్యాంపు ఆఫీస్ లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

**చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 5(నేషనలిస్ట్ వాయిస్)**

స్వాతంత్ర్య సమరయోధుడు నవభారత నిర్మాత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు సిబ్బంది ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వన్ టౌన్ సీఐ కరుణాకర్, ఎంటిఓ సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్సైలు ప్రవీణ్, రవి, రామకృష్ణ, మనీషాలు పాల్గొన్నారు.



# అబోత్ పల్లిలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**తూప్రాన్, ఏప్రిల్ 5 (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి):**



మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు అబోత్ పల్లి వీధిలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బాబు జగ్జీవన్ రామ్ కార్యవర్గ సభ్యుడు గుడిసె శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో స్థానిక నాయకులు పాల్గొని ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జైపాల్ రాథోడ్ నాయక్, నాయకులు అశోక్, నాగరాజు యాదవ్ మాట్లాడుతూడాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికై, అనంతరం కార్మిక, రైల్వే వంటి కీలక శాఖల్లో మంత్రి పదవులు నిర్వహించి, ఉప ప్రధానిగా దేశానికి విశిష్ట సేవలు అందించారని గుర్తుచేశారు. దేశ పరిపాలనలో ఆయన చూపిన దక్షత భారతదేశానికి మార్గదర్శకంగా నిలిచిందని, కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని, ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం సభ్యులు పరమేష్, కొత్తపల్లి నర్సింగారావు, గుడిసె ఆనంద్, స్వామి, 2వ వార్డు సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి రవాణా పట్టివేత

**ఏప్రిల్ 5 (ఏర్గట్ల నేషనలిస్ట్ వాయిస్)**

ఏర్గట్ల మండల కేంద్రంలో అక్రమ మట్టి రవాణా ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి , శుక్రవారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్గట్ల నుండి బట్టపూర్ వైపు మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను అధికారులు గుర్తించారు. టిప్పర్‌ను ఆపి డ్రైవర్‌ను విచారించగా, మట్టి తవ్వుతున్న ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ ఒక జేసీబీతో పాటు మూడు ఖాళీ టిప్పర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తదనంతరం జేసీబీతో పాటు మట్టితో ఉన్న టిప్పర్ మరియు మూడు ఖాళీ టిప్పర్లను స్వాధీనం చేసుకుని అర్ధరాత్రి సమయంలో పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఏర్గట్ల తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.



# కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడిని ఖండించిన మనోహరాబాద్ మండల బిఆరెస్ నాయకులు

**తూప్రాన్, ఏప్రిల్, 5. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

గజ్వేల్ లో నిన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని మనోహరబాద్ మండల బిఆరెస్ నాయకులు ఖండించారు. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడిని నిరసిస్తూ మనోహరబాద్ మండల బిఆరెస్ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ కు చెందిన గుండాలు ఎవరూ లేని సమయంలో వచ్చి క్యాంపు కార్యాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేసి మన తెలంగాణ సాధించినటువంటి చంద్రశేఖర రావు గారి ఫోటోలు తొలగించి నానా బీభత్సం చేయడం జరిగిందని అన్నారు. ఈ కాంగ్రెస్ గుండాలకి రాబోయేది టిఆర్ఎస్ ప్రభుత్వంమే అని తగిన బుద్ధి చెప్తామని తెలియజేస్తున్నామని అన్నారు. కేసిఆర్ గారు 10 సంవత్సరములలో గజ్వేల్ నియోజకవర్గం లో సుమారు పదివేల కోట్ల రూపాయలు అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ గజ్వేల్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో భూ కబ్జాలు, మట్టి మాఫియా, దౌర్జన్యాలు జరుగుతున్నాయని అన్నారు. కాబట్టి రాబోయే ఇలాంటి ఎన్నికలు జరిగినా టిఆర్ఎస్ పార్టీ విజయడంకా మోగిస్తుందని మరొకసారి హెచ్చరిస్తా ఉన్నామని అన్నారు. కాంగ్రెస్ గుండాల్లారా ఖబర్దార్ అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు మనోహరాబాద్ మండల అధ్యక్షులు ఇమాంపురం శేఖర్ గౌడ్, పొట్ల్లోళ్ల వెంకట్ గౌడ్, పూల అర్జున్, కుంట రాజు, లింగారెడ్డి పెట్ శివగౌని శ్రీనివాస్ గౌడ్, బామని ప్రవీణ్ యాదవ్, మన్నే శ్రీనివాస్, వావిలాల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ వద్ద రోడ్డులో భారీ రంధ్రం

**ఏప్రిల్ 5 ఏర్గట్ల నేషనలిస్ట్ వాయిస్**

ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ ఇందిరమ్మ ప్లాట్లలోని అంగన్వాడీ కేంద్రం సమీపంలో సీసీ రోడ్డుపై పెద్ద రంధ్రం ఏర్పడి చాలా రోజులుగా అలాగే ఉంది. డ్రైనేజీపై నిర్మించిన ఈ రోడ్డులో వచ్చిన రంధ్రాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ అంగన్వాడీకి వచ్చే చిన్నారులు, ఈ రంధ్రం వద్ద జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో గుంత కనిపించక ప్రమాదాల ముప్పు పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డును మరమ్మతు చేయాలని గల్లీవాసులు కోరుతున్నారు.




# ప్రజాప్రతినిధికి శుభాకాంక్షల వెల్లువ

## - ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసిన టీడీపీ నేతలు

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 5 (నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజును తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద గల ఎమ్మెల్యే నివాసంలో ఈ భేటీ జరిగింది.కూటమి విజయకేతనం ఎగురవేసిన నేపథ్యంలో, ఏపుకుంట పంచాయతీ టీడీపీ అధ్యక్షులు సాధనాల భూసిబాబు, సీనియర్ నాయకులు కాల్నిడీ రాంబాబు ఎమ్మెల్యే బాలరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీల మధ్య సమన్వయానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం, రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై కూడా ఈ సమావేశంలో ప్రాథమికంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి కార్యకర్తలు, అనుచరులు పాల్గొన్నారు.



# జగజ్జీవన్ రావు 118 వ జయంతి వేడుకలు

**జంగారెడ్డిగూడెం ఏప్రిల్ 5 (నేషనలిస్ట్ వాయిస్)**

ఈరోజు ఉదయం 9 గంటలకు బాబు జగజీవన్ రామ్ 118 వ జయంతి జంగారెడ్డిగూడెం పట్టణంలో నవ చైతన్య అంబేద్కర్ యువజన సంఘం, స్థానిక ఎస్సీ పేట 6 7 8 వార్డులు, ఎస్సీ పేట యువకులు, పెద్దలు, దళిత ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ పోలవరం ఏఎంసీ చైర్మన్ జెట్టి గురునాధరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు పరిమి సత్తిపండు,మాజీ జెడ్పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, దళిత హక్కుల దండోరా అధ్యక్షులు లాగు రవిబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొబ్బర రాజ్పాల్ కుమార్, మాజీ కౌన్సిలర్ నీకూరి కిషోర్, కనుమూరి లావణ్య, ప్రగడ సౌభాగ్యవతి, జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుభాష్, జంగారెడ్డిగూడెం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వీరప్రసాద్ మరియు దళిత ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అయినపర్తి వెంకటరత్నం, ప్రగడ నాగేశ్వరరావు, లాగు జయరాజ్ మాస్టర్, రఘు మాస్టర్, రాజా, శ్రీను, టి రామారావు, ఏ. ప్రభు ఎస్సీ పేట పెద్దలు చిడిపి వెంకట్, కొండపల్లి పండు, మల్లిపూడి రవికుమార్, మద్దిపాటి శ్రీను, మనెల్లి గంగరాజు, కొండపల్లి ప్రభుదాసు, ఎస్సీ పేట యువకులు దున్న శివ, ముప్పిడి ఏలి,దిరిసిపోము సోమరాజు, మద్దిపాటి ఉదయ్, ముప్పిడి విష్ణు, డొక్కా లక్ష్మణ్ , కడిమి కిరణ్, అనుములంగ శ్రీను, ముప్పిడి నాగార్జున, ది రిసిపోము డూప్లే, మర్రి నాగరాజు, ఉర్లాపు రవి, నాగు, దోసూరి,దొర మామిడి వెంకట్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కూన పాము వినయ్, కత్తి వసంత్ తదితర నాయకులు పాల్గొని పెద్ద ఎత్తున బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దలందరూ మాట్లాడుతూ ఈ దేశ అభివృద్ధికి దళితుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన నాయకులు బాబు జగజీవన్ రామ్ అని ఆయనను కొనియాడారు భారత ప్రధానిగా కార్మిక మంత్రిగా రక్షణ మంత్రిగా ఆహార భద్రతా మంత్రిగా 50 సంవత్సరాలు సుదీర్ఘంగా కేంద్ర మంత్రిగా పనిచేసే ఈ దేశ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆయనను కొనియాడారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు వివిధ వర్గాలకు చెందిన నాయకులు అందరూ పాల్గొని బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆరో వార్డులో గల బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుభాష్, జంగారెడ్డిగూడెం సబ్ ఇన్స్పెక్టర్ వీర ప్రసాదు పూలమాలలు వేసి నివాళులర్పించారు



**ఇట్లు**

**ఎస్ సి పేట, 6,7,8 వార్డుల ఎస్సీ వేట యువకులు, పెద్దలు, నవ చైతన్య అంబేద్కర్ యువజన సంఘం, మరియు మాజీ జెడ్పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు**

# వాహనదారులకు ఎస్సై జయబాబు 'స్ట్రాంగ్ వార్నింగ్'

# ప్రాణాలతో చెలగాటమొద్దు!

## - నిబంధనలు పాటించకపోతే జరిమానాలు కాదు..

## - జైలుకే: టీ. నర్సాపురం పోలీసుల హెచ్చరిక

**పోలవరం ఏప్రిల్ 5(ప్రజావీక్షణం)**

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలంలోని వాహనదారులందరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మండల సబ్ ఇన్స్పెక్టర్ జయబాబు హెచ్చరించారు. ఆదివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా ఆయన వాహనదారులను ఉద్దేశించి కీలక సూచనలు చేశారు. "మీ ఇంటి వద్ద మీ కోసం మీ కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారని గుర్తుంచుకోండి. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. హెల్మెట్ లేని ప్రయాణం మృత్యువుతో పోరాటమే." అలాగే "ప్రతి వాహనదారుడు తమ వెంట డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ మరియు పొల్యూషన్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలి. తనిఖీల్లో పత్రాలు చూపని పక్షంలో వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం."అంతేకాకుండా "తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి వారి ప్రాణాల మీదకు తీసుకురావద్దు. మైనర్లు వాహనం నడిపితే వాహన యజమానిని, తల్లిదండ్రులను బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేస్తాం." మరి ముఖ్యంగా "మద్యం సేవించి వాహనం నడిపి ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టి కోర్టుకు పంపిస్తాం.""పోలీసులు తనిఖీలు చేస్తున్నారంటే అది మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి కాదు, మిమ్మల్ని సురక్షితంగా మీ ఇంటికి చేర్చడానికి. మేము విధించే జరిమానా కంటే మీ ప్రాణం చాలా విలువైనది. కాబట్టి పోలీసులకు సహకరించి, బాధ్యతాయుతమైన పౌరులుగా వాహనాలు నడపండి." అలాగే ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ఎల్లప్పుడూ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.



# ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

## - టీ. నర్సాపురంలో నివాళులర్పించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 5 (నేషనలిస్ట్ వాయిస్)**

**టీ. నర్సాపురం, ఏలూరు జిల్లా:**

భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శీలం వెంకటేశ్వరరావు బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలోను, అణగారిన వర్గాల అభ్యున్నతిలోను జగజ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, సమాజంలో సమానత్వం కోసం ఆయన పడిన తపన నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



**పాల్గొన్న ముఖ్య నాయకులు:**

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాల్నిడీ రాంబాబు, ఏపుకుంట పంచాయతీ అధ్యక్షులు సాధనల భూషిబాబు, మరియు కూటమికి చెందిన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులందరూ జగజ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పించి, ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు.

# జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

## జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

## దళితుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**కరీంనగర్ బ్యూరో (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

వ్యవసాయ శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధాని గా దేశానికి 30 ఏళ్లు సేవలందించిన జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లిమేడిపల్లి సత్యంలి మాట్లాడారు. మహనీయుల మాదిరి మనం కూడా ఉన్నతంగా ఆలోచించి గొప్ప పనులు చేయాలని సూచించారు. ఇండో పాక్ యుద్ధ సమయంలో దేశాన్ని కరువు నుంచి కాపాడిన మహనీయుడని జగ్జీవన్ రాము ను కొనియాడారు.తెలంగాణ రాష్ట్ర సాధన లోనూ జగ్జీవన్ రామ్ కుమార్తె అప్పటి లోక్ సభ స్పీకర్ కీలక పాత్ర పోషించి బిల్లు పాస్ చేయించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. దళితులకు ఇందిరమ్మ ఇల్లు, అసైన్డ్ భూములు ఇచ్చినట్లు తెలిపారు.కాంగ్రెస్ హయాంలో ఎస్సీ వర్గీకరణ జరిగిందని.. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కు చట్టబద్ధత కల్పించడంతో నేడు అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు.జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు అనుగుణంగా ప్రతి ఒక్కరు ఉన్నత చదువులు చదివి సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.కలెక్టర్ లిచిత్రా మిశ్రాలి మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా, ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా అందించే సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు.మీ సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. దేశానికి జగ్జీవన్ రామ్ అందించిన సేవలు వెలకట్టలేనివని.. ఆ మహనీయుడు స్ఫూర్తితో ముందుకు సాగుదామని పేర్కొన్నారు. కరీంనగర్ లిసీపీ గౌస్ ఆలంలి మాట్లాడుతూ న్యాయ శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా దేశానికి 30 ఏళ్లు సేవలందించిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని అన్నారు. సమానత్వం కోసం ఎంతో కృషి చేశాడని వివరించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ, పరిహారం అందించే విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లిఅశ్విని తానాజీ వాకడేలి దేశ అభివృద్ధి కోసం మనం చేసే వృత్తిలో బలహీన వర్గాలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. నగరపాలక కమిషనర్ లిప్రఫుల్ దేశాయ్‌లి మహనీయుల ఆలోచనలు, పనులను స్ఫూర్తిగా తీసుకొని.. మన హక్కులు, విధులు తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టడీ సర్కిల్ లో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురు, సంక్షేమ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులు





తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కులాంతర వివాహాలు చేసుకున్న పలువురికి ప్రోత్సాహకాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల (రెవెన్యూ) కలెక్టర్ లక్ష్మి కిరణ్, కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్, జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 జయంతి వేడుకలు

**చిట్యాల ఏప్రిల్ 5 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నే యుగేందర్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య లు మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహానీయుడు గొప్ప సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు సమాజంలో అందరికీ సమాన న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన సామాజిక న్యాయ సాధకుడు అని తెలిపారు. హరిత విప్లవంలో ముఖ్య భూమిక పోషించిన భారత దేశ తొలి మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. దేశానికి అట్టడుగు వర్గాల వారికి అందరికీ చేసిన సేవలు మరువలేని అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ దబ్బేట రమేష్ అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్ మండల ఉపాధ్యక్షులు దూడపాక సరోత్తం 12వ వార్డ్ సభ్యులు శనిగరపు మొగిలి అంబేద్కర్ వాదులు పాముకుంట్ల చందర్ ఆరెపల్లి నరసింహ రాములు దబ్బేట రవి తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

## ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పాటన్ చెరు / (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

భారత మాజీ ఉప ప్రధాని, దేశంలో సామాజిక న్యాయ సాధనకు అవిరళ కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం పటాన్చెరు పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి స్థానిక మాజీ ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు.




# బేడ బుడగ జంగం రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఘన సన్మానం

**కరీంనగర్ (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కరీంనగర్‌లో బేడ బుడగ జంగం రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రోజున కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బేడ బుడగ జంగం కులం నుంచి కార్పొరేటర్‌గా విజయం సాధించిన భూపతి రవీందర్ ని వేదికపై ఘనంగా సత్కరించారు. ఆయన సాధించిన విజయం బేడ బుడగ జంగం సమాజానికి గర్వకారణమని పలువురు నాయకులు పేర్కొన్నారు. సమాజం రాజకీయంగా మరింత ముందుకు రావడానికి ఇలాంటి నాయకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలగాని శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ సునీల్ రావు విచ్చేసి అభినందనలు తెలియజేసి , బేడ బుడగ జంగం సమాజం సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన జాతీయ అధ్యక్షులు ఆల్ ఇండియా బేడ బుడగ జంగం కాన్ఫెడరేషన్ డాక్టర్ ఎన్ఆర్ వెంకటేశం మాట్లాడుతూ సమాజ ఐక్యత, రాజకీయ చైతన్యం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.



# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఘనం

## దేశ సేవలో 'బాబుజీ' పాత్ర చిరస్మరణీయం!

**తొర్రూర్, ఏప్రిల్ 05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

మహోన్నత స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబుజీ' జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఆదివారం తొర్రూర్ పట్టణంలోని న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబుజీ చిత్రపటానికి పూలమాలలు వేసి న్యాయవాదులు ఘన నివాళులర్పించారు.

**బార్ అసోసియేషన్ అధ్యక్షుల సందేశం:**

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బార్ అసోసియేషన్ అధ్యక్షులు విరదాసు వెంకట రత్నం మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్ రామ్ ఈ దేశానికి అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. రక్షణ మరియు వ్యవసాయ శాఖ మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ చరిత్రలో మైలురాళ్లుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సమాజంలోని అణగారిన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని రత్నం గారు వివరించారు.

**అభివృద్ధిలో బాబుజీ ముద్ర:**

దేశంలో హరిత విప్లవానికి నాంది పలికి, ఆహార భద్రతలో భారతదేశాన్ని స్వయంసమృద్ధిగా తీర్చిదిద్దడంలో బాబూ జగ్జీవన్ రామ్ కృషి మరువలేనిదని న్యాయవాదులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**పాల్గొన్న ముఖ్యులు:**

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మరియు న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో ముఖ్యులు:తోనుకునూరి సైదులు (ప్రధాన కార్యదర్శి)కృపావతి (కోశాధికారి)ఘనపురం అనిల్ కుమార్ (ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు) గంగాధరి విజయ (ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు) న్యాయవాదులు: మైలపాక అశోక్, ఆకారపు వెంకన్న, సంతోష్, శ్రీకాంత్ మరియు ఇతర సభ్యులు.తొర్రూర్ బార్ అసోసియేషన్ సభ్యులందరూ కలిసికట్టుగా బాబుజీకి నివాళులర్పిస్తూ, ఆయన చూపిన బాటలో నడవాలని సంకల్పించారు. దేశ భక్తిని, సామాజిక సమానత్వాన్ని చాటిచెప్పేలా ఈ వేడుకలు జరిగాయి.







# ఆల్ఫోర్స్ స్కూల్ లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**సుల్తానాబాద్ ఏప్రిల్-05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో గ్లిట్స్ వార్షికోత్సవ, వేడుకలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించడం జరిగింది. ట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, హాజరై, విద్యా సంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణ, లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడలు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటాలని సూచించారు. విద్యార్థులకు ఉన్నత స్థానాలు రావాలంటే క్రమశిక్షణ కృషి అత్యంత కీలకమని పేర్కొన్నారు. పిల్లల తల్లిదండ్రులు ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. అనంతరం విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర విద్యాభివృద్ధికి మా సంస్థ కట్టుబడి ఉందన్నారు. అనంతరం వేడుకలలో విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు ప్రధాన ఆకర్షంగా నిలిచాయి. నృత్యాలు నాటికలు వినోద కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతో అద్భుతంగా ప్రదర్శించారు ఈ కార్యక్రమానికి ప్రదర్శనలు ప్రత్యేకమైన ఆనందాన్ని తీసుకువచ్చాయి.ప్రతి విద్యార్థి తమ ప్రతిభ చక్కగా ప్రదర్శించారు అలాగే చదువు ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్ లు గాదాసు మంజుల రవీందర్, కందునూరి సమత కుమార్, చింతల రాజు, టికే ప్రభాకర్, గరిగే శోభారాణి శ్రీనివాస్ వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్, మాజీ జెడ్పిటిసి ఐల రమేష్, సాయిరి మహేందర్ , కందుకూరి ప్రకాష్ రావు పెద్దన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయురాళ్లు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..






# ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**కరీంనగర్ (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని మంచిర్యాల్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి లిబీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ , జిల్లా కార్యదర్శి వాయుల రాజకుమార్‌లి తో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.. అనంతరం వారు మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, దళిత తొలి ఉప ప్రధాని సమ సమాజ స్థాపనకై కృషి చేసిన కృషివలుడు దేశంలో సామాజిక న్యాయ సాధనకు గొప్పగా కృషిచేసిన భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి సందర్భంగా వారికి ఇవే మా ఘన నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు..



# జాతీయ భద్రత , దేశహితం, భరతమాత సేవ కోసం పనిచేసే ఏకైక పార్టీ బిజెపి

- బిజెపి కుటుంబ సభ్యులందరికీ పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర

**కరీంనగర్ (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

జాతీయ భద్రత , దేశ హితం, భరతమాత సేవ కోసం దేశంలో పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. ఏప్రిల్ 6 న 47వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ పార్టీ పీలుపు మేరకు ముందస్తు వేడుకల్లో భాగంగా ఆదివారం రోజున బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అలుగునూర్ (శ్రీ వెంకటేశ్వర కాలనీ)లోని తన స్వగృహంపై పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6 న అటల్ బిహారీ వాజ్ పాయ్ నేతృత్వంలో స్థాపించబడిన భారతీయ జనతా పార్టీ నేడు ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా ఆవిర్భవించిందన్నారు. వరల్డ్ లార్జెస్ట్ పార్టీ గా బిజెపి అవతరించడానికి ప్రధాన కారణం పార్టీ సిద్ధాంతమేనన్నారు. నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ నినాదమే బీజేపీ నీ తిరుగులేని శక్తిగా మార్చిందన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బిజెపి ప్రస్థానం నేడు దేశాన్ని ఏలే స్థితికి వచ్చి, వరుసగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిందన్నారు.



ప్రజలు బిజెపి పట్ల దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ముందు కొనసాగుతుందన్నారు. బిజెపి బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ శ్రేణుల శ్రమ కూడా మరువలేనిదన్నారు. ముఖ్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జాతీయ భద్రతకు , దేశ అభివృద్ధి కోసం పెద్ద పీట వేసి ముందు కొనసాగుతుందన్నారు. ప్రధానంగా దేశ సమస్యలను గుర్తించడం భవిష్యత్ లో వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు పరస్పర యుద్ధాలతో విచ్ఛిన్నమవుతున్నాయని, భారతదేశం మాత్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ విశ్వ గురువు దిశలో ముందుకు దూసుకుపోతుందన్నారు. మేకిన్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భరభారత్ బలోపేతమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రధానంగామోడీ 2014లో వచ్చాక దేశంలో ప్రతీ రంగంలోనూ శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికా బద్ధంగా ముందుకు కొనసాగుతున్నారని తెలిపారు. దేశానికి , రాష్ట్రాలకుబిజెపి ప్రభుత్వాలే శ్రీరామరక్ష అని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

# తాళ్ల పేట ముస్లిం మైనార్టీ యూత్ నూతన కమిటీ ఎన్నిక

**దండేపల్లి ఏప్రిల్ -05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

దండేపల్లి మండలంలోని తాళ్లపేట ముస్లిం మైనార్టీ యూత్ కమిటీని ఆదివారం జామా మసీదులో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా మహమ్మద్ సోహైల్ ఖాన్ , ఉపాధ్యక్షులుగా వీణ అఫ్రోజ్, ప్రధాన కార్యదర్శిగా సాబేర్ ఖాన్, సంయుక్త కార్యదర్శిగా ఎజారుల్లా ఖాన్, క్యాషియర్ గా వీణ అల్మాస్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ వీణ ఆర్ఫత్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు..



# సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన బాబూ జగ్జీవన్ రామ్

- దేశ సేవే పరమ ధర్మంగా భావించి ఆచరించిన నాయకుడు
- చనిపోయేదాకా ఎంపీగా కొనసాగిన నేత
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- బాబూ జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి
- కరీంనగర్ మేయర్ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన బండి సంజయ్

**కరీంనగర్ (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

భారత రాజకీయ చరిత్రలో సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు, దళిత జాతి రత్నం బాబూ జగ్జీవన్ రామ్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. కేంద్రంలో 29 ఏళ్లపాటు మంత్రిగా కొనసాగిన బాబూ జగ్జీవన్ రామ్ దేశ సేవే పరమ ధర్మంగా భావించి ఆచరించి చూపారని తెలిపారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఈరోజు ఉదయం కరీంనగర్ లోని మంచిర్యాల చౌరస్తా వద్దనున్న ఆయన విగ్రహానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతోపాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "చిన్నప్పటి నుండి కుల వివక్షను ఎదుర్కొని పోరాడిన నాయకుడు జగ్జీవన్ రాం. అంటరానివారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని చివరిదాకా అంకితం చేసిన నాయకుడు. 1.కష్టాలను జయించి ఎదగాలి. 2.సమాజంలోని బలహీన వర్గాల కోసం నిలబడాలి. 3.దేశ సేవే మన పరమ ధర్మం అనే మూడు నినాదాలను పుణికి పుచ్చుకుని జీవితాంతం వాటి కోసం పాటుపడిన నాయకుడు జగ్జీవన్ రామ్" అని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1952 నుంచి ఆయన చనిపోయే 1986 వరకూ పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన జగ్జీవన్ రామ్ కేంద్రంలో 29 ఏళ్లపాటు మంత్రిగా సేవలందించారని గుర్తు చేసుకున్నారు.దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ గాంధీ వెన్నంటి నడిచిన జగ్జీవన్ రామ్ భారత రాజకీయ, సామాజిక రంగాల్లో అజాతశత్రువుగా నిలిచారని తెలిపారు. జగ్జీవన్‌రామ్ అనుసరించిన ఆదర్శాలు.. చూపిన సంస్కరణ మార్గాలనూ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**మేయర్ క్యాంపు కార్యాలయ ప్రారంభం**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు మధ్యాహ్నం కరీంనగర్ లోని తీగలగుట్టపల్లిలో మేయర్ కొలగాని శ్రీనివాస్ ఏర్పాటు చేసిన మేయర్ క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, నాయకులు కేంద్ర మంత్రిని గజమాలతో సత్కరించారు. క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతోపాటు బీజేపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు.






# స్వగృహంపై పార్టీ జెండాను ఎగరవేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

- బిజెపి శ్రేణులందరికీ పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**కరీంనగర్ (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

భారతీయ జనతా పార్టీ జాతీయ శాఖ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆదివారం రోజున హుజురాబాద్ లోని తన స్వగృహంపై పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కుటుంబ సభ్యులకు భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏప్రిల్ 6, 1980న అటల్ బిహారీ వ వాజ్ పాయ్ నేతృత్వంలో స్థాపించబడిన బిజెపి , దేశ సేవ, ఆత్మ నిర్భర భారత్ లక్ష్యంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందన్నారు. భారతీయ జనతా పార్టీ ఎంచుకున్న సిద్ధాంతం, భావాజాలం తో నే పార్టీ ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా అవతరించిందని , వరల్డ్ లోనే అతిపెద్ద క్యాడర్ బేస్డ్ పార్టీ బిజెపి యే అన్నారు.ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ నేడు దేశాన్ని ఏలుతుందని , వరుసగా 3 సార్లు కేంద్రం లో అధికారం లో వచ్చిందని, దేశంలోనే తిరుగు లేనిశక్తిగా అవతరించిందన్నారు. బీజేపీ పార్టీ సిద్ధాంతం ఎంతో గొప్పదన్నారు.నేషన్ ఫస్ట్.,పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ సిద్ధాంతం... దేశం కోసం మన పార్టీ ఆలోచించే విధానంతోనే పార్టీ ఈ స్థితికి వచ్చిందన్నారు.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, బిజెపి పట్ల ప్రజలంతా ఎంతో విశ్వాసంతో ఉన్నారని తెలిపారు.



# జిల్లా ఆవోప ఆధ్వర్యంలో కార్పొరేటర్లకు సన్మానం

**కరీంనగర్ (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

స్థానిక కృష్ణ నగర్ లోని ఆవోపా భవనం లో ఆదివారం కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసో సియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం ఆధ్వర్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థ ఆర్యవైశ్య కార్పోరేటర్లు వంగల పవన్ , కొలిపాక రమ్యశ్రీ – శ్రీనివాస్ , కరీంనగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలలో గెలుపొందిన బండ శివకుమార్, నీరుమళ్ళ సంధ్యారాణి లకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వైశ్యులు ముందుకు సాగాలని, అందరు ఐక్య మత్యంగా ఒక్కరికి ఒక్కరు సహాయ సహకారాలు అందించుకోవాలని అప్పుడే బలమైన శక్తి గా ఎదుగుతమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అవోపా ముఖ్య సలహాదారులు గంజి స్వరాజ్య బాబు , రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ నారాయణ , జిల్లా అవోపా ప్రధాన కార్యదర్శి అయిత ఈశ్వర ప్రసాద్, కోశాధికారి కట్కూరి సుధాకర్,ఉపాధ్యక్షులు కొత్త ప్రకాశ్ , పబ్బ అరుణ, కొండూరు శ్రీనివాస్ , తోడుపనూరు దశరథం, కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలి

జనసేన పార్టీ జిల్లా నాయకులు కంకణాల దేవేందర్

**చిట్యాల ఏప్రిల్ 5 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నారని వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని జనసేన పార్టీ జిల్లా నాయకుడు కంకణాల దేవేందర్ డిమాండ్ చేశారు. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్లకు సంబంధించి, ప్రస్తుత ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ లెటర్లు అందజేశారు అని అన్నారు, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సుమారు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి కొత్త నోటిఫికేషన్లు విడుదల కాలేదు.ఇటీవల రాష్ట్రంలో సుమారు 14,000 పోలీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, తెలంగాణ డిజిపి తెలిపారని అన్నారుఈ పరిస్థితుల్లో నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



# బిజెపి జెండాను ఎగురవేసిన మేయర్ కొలగని శ్రీనివాస్

- బిజెపి కుటుంబ సభ్యులందరికీ పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు నగర మేయర్ కొలగని శ్రీనివాస్

**కరీంనగర్ (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

ఏప్రిల్ 6 న 47వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ పార్టీ పీలుపు మేరకు ముందస్తు వేడుకల్లో భాగంగా ఆదివారం రోజున నగర మేయర్ కొలగని శ్రీనివాస్ తీగల గుట్టపల్లి లోని తన స్వగృహంపై పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా కొలగని శ్రీనివాస్ మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6 న అటల్ బిహారీ వాజ్ పాయ్ నేతృత్వంలో స్థాపించబడిన భారతీయ జనతా పార్టీ నేడు వరల్డ్ లోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా ఆవిర్భవించిందన్నారు.బిజెపి సిద్ధాంతం ,నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ నినాదమే బీజేపీ నీ తిరుగులేని శక్తిగా మార్చిందన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బిజెపి ప్రస్థానం నేడు దేశాన్ని ఏలే స్థితికి వచ్చి, వరుసగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిందన్నారు.



# సిద్ధాంతమే బీజేపీ బలం

- అట్టడుగునున్న పేదవాడికి సైతం అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలన్నదే బీజేపీ సిద్ధాంతం
- 2047 నాటికి భారత్ ను ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మార్చాలన్నదే మా లక్ష్యం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇంటిపై పార్టీ జెండాను ఎగరేసిన కేంద్ర మంత్రిలి
- బీజేపీ కార్యకర్తలందరికీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్





**కరీంనగర్ (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

భారతీయ జనతా పార్టీ వరుసగా మూడుసార్లు అధికారంలోకి రావడంతోపాటు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించడానికి ప్రధాన కారణం పార్టీ సిద్ధాంత బలమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. అట్టడుగునున్న చిట్ట చివరి పేదవాడికి సైతం అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాలనే బీజేపీ అంత్యోదయ సిద్ధాంతమని, వాటిని తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మహానేత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని కొనియాడారు. భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు బండి సంజయ్ కుమార్ ఈరోజు ఉదయం తన నివాసంపై పార్టీ జెండాను ఎగరేశారు. రేపు (ఏప్రిల్ 6) బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ కార్యకర్తలందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు...

"2 సీట్లతో మొదలైన బీజేపీ ప్రస్థానం నేడు నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో 12 ఏళ్లుగా అప్రతిహత పాలన కొనసాగుతోంది. 2 సీట్లతో ఏం సాధిస్తారని వెక్కిరించిన పార్టీలే బీజేపీ దెబ్బకు కాలగర్భంలో కలిశాయి. దీనికి కారణం బీజేపీ సిద్ధాంత బలం, జాతీయవాద భావాలే. చిట్ట చివరి పేదవాడి వరకు ప్రభుత్వ పథకాలు అందించాలనే పండిట్ దీన్ దయాళ్ అంత్యోదయ సిద్ధాంతాలను అమలు చేస్తున్న ప్రభుత్వం మోదీదే"అని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనా విజయాలను ప్రస్తావిస్తూ..."ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్ ప్రజలకు స్వాతంత్ర్యం అందించారు. అయోధ్య రామ మందిర నిర్మాణంతో కోట్లాది హిందువుల ఆకాంక్షను నెరవేర్చారు. ట్రిపుల్ తలాఖ్ రద్దు, సీఏఏ, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం వంటి విప్లవాత్మక చర్యలు తీసుకున్న ఘనత కూడా మోదీ ప్రభుత్వానిదే. ఆపరేషన్ సింధూర్, సర్జికల్ స్ట్రయిక్స్ తో శత్రుదేశాల వెన్నులో వణుకు పుట్టించిన నేత మోదీ"అని పేర్కొన్నారు. 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి బయట పడేయడమే కాకుండా దేశ ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న నేత మోదీ"అని కొనియాడారు. 2047 నాటికి భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశంగా మార్చాలనే ధృఢ సంకల్పంతో మోదీ ప్రభుత్వం చేస్తున్న క్రుషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

## మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం

- చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్

**తొర్రూర్ ఏప్రిల్ 5 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని పదవ వార్డులో చైర్మన్ తూణం శ్రవణ్ కుమార్,కౌన్సిలర్ ముద్దసాని సురేష్ కమిషనర్ శ్యాంసుందర్ తోకలిసి ఆదివారం వార్డులోని సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా డ్రైనేజీ విద్యుత్ తదితర సమస్యలను తొందరలోనే మున్సిపాలిటీ సిబ్బంది తో చెప్పి పదో వార్డులోని వివిధ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వార్డ్ ప్రజల కు హామీ ఇవ్వడం జరిగిందనీ తెలిపినారు.



## సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ కు ఆత్మీయ సన్మానం

**సుల్తానాబాద్ ఏప్రిల్-05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కరీంనగర్ పద్మశాలి ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా పద్మశాలి ఆత్మీయ సన్మాన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఐతరాజ్ పల్లి నూతన సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ కు ఆల్ ఇండియా పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి చేతుల మీదుగా సర్పంచ్ కు ఘనంగా సన్మానం చేసి మెమొంటో ను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెతుకు సత్యం, పూసాల భక్త మార్కండేయ దేవాలయ కమిటీ చైర్మన్ వలస నీలయ్య, మాజీ ఎంపీపీలు, వాసాల రమేష్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు..



## మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ

**సీనియర్ జర్నలిస్టు లయన్ మేకల మల్లేశం సహకారంతో చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు**

**(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్) మేడిపల్లి ఏప్రిల్ 5**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లిలో ఆదివారము నాడు ఉప్పల్ బస్ డిపో వద్దమండుటెండలో రోడ్ల పైన పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారులు మరియు చెప్పులు కొట్టుకునే వారికి మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లయన్స్ క్లబ్ సభ్యులు సీనియర్ జర్నలిస్టు లయన్ మేకల మల్లేశం వారి సహకారంతో పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లయన్ వేముల కేశవనాదం గౌడ్,లయన్ బిక్షపతి,లయన్ దుర్గ,లయన్ నరసింహాచారి, లయన్ సందీప్,లయన్ బాలరాజు గౌడ్,మేడిపల్లి క్లబ్ ఎక్స్టెన్షన్ చైర్పర్సన్ లయన్ అశోక్,లయన్ శారద పాల్గొన్నారు.ఈకార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు.




## బాలే భూమయ్య కు అన్నివేళలా అండగా కాంగ్రెస్ పార్టీ

**దండేపల్లి ఏప్రిల్ -05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

దండేపల్లి మండలం పెద్దపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బాలే భూమయ్య భార్య ఇటీవల మరణించడం జరిగింది మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు ఆదివారం పెద్దపేట కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మరియు స్థానిక సర్పంచి పెంట సత్తయ్య మాజీ ఎంపీటీసీ బొడ్డు కమలాకర్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సహాయం 6,000 రూపాయలు 25,కిలోల బియ్యం అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నియోజకవర్గం లో ఏ పేద ఇంటికైనా పెద్ద కొడుకుల మా ప్రేమ్ సాగర్ రావు ఉంటడని ప్రతి కార్యకర్త కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు అముదాల రాజన్న పసార్తి రాజయ్య వసార్తి రమేష్ పెంట భూమయ్య గాజుల నారాయణ గాజుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్) ఏప్రిల్ 5 ఆదివారం**

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంతో పాటు చందంపేట, ఖాజాపూర్, సూరారం, గ్రామాలలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి





నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ, సమాజంలో అస్పృశ్యతను రూపుమాపేందుకు కృషి చేసిన వారిని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు రామచంద్రం, ఎమ్మార్పీఎస్ నాయకులు మురళి మాదిగ, తొంట దుర్గపతి, కాడిగల మల్లేశం, గడ్డం సురేష్, రమేష్ కర్నే సాయిలు, బాచుపల్లి పాండు, సుధాకర్, సర్పంచ్ ఆకుల సంతోష నవీన్, సూరారం సర్పంచ్ చిలుక నాగరాజు, సెక్రటరీ నాంపల్లి,పాలకవర్గ సభ్యులు,ఉప సర్పంచ్ భాను ప్రసాద్ ,మాజీ సర్పంచ్, శ్రీమాన్ రెడ్డి, రాజిరెడ్డి, సూరారం ఉపసర్పంచ్ రావణబోయిన మల్లేశం తలకొకుల కృష్ణ,నర్సింలు , యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి గుడి నిర్మాణం కోసం సర్వసభ్య సమావేశం ఏర్పాటు

**ఆలయ కమిటీ ముక్తకంఠం తో ఏకగ్రీవ తీర్మానం**

**(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్) మేడిపల్లి ఏప్రిల్ 5**

మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధి బోడుప్పల్ సర్కిల్లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శివాలయం నిర్మాణం కోసం మాజీ కార్పొరేటర్ పొద్దుటూరి శోభా రాణి వెంకటేష్ గుప్తా వాసవి నగర్ లోని వారి స్వంత స్థలం రెండువందల ఎనభై అయిదు గజాల ప్లాటు కాలనీలోని (పార్క్ ప్రక్కన ) ఉన్న స్థలాన్ని ఆదివారం నాడు శ్రీ గౌరీ భట్ల విఠల శర్మా సిద్ధాంతి చే స్థల పరిశీలన మరియు ఆలయ శశీఖు స్థాపన మరియు కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకల గూర్చి నేటి సర్వసబ్య సమావేశం లో వివరించారు నేటి సమావేశం లో వివిధ కాలనిలా ప్రజలు.



## శ్రీనగర్ కాలనిలోని కేటిపిఎస్ రైల్వే కట్ట భూముల ఆక్రమణ

**ఏజెన్సీ నిబంధనలను తుంగలో తొక్కి గిరిజనేతరులు ఇండ్ల నిర్మాణాలు**

**కాసులకు కక్కుర్తి పడి పాత "డేట్"లో ఇంటి నెంబర్లు మంజూరు ....?**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

లక్ష్మీదేవిపల్లి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనికొన్ని మండలాలు ఏజెన్సీ ప్రాంతాలుగా ఉన్నాయి. కొత్తగూడెం పట్టణ లక్ష్మీదేవి పల్లి మండలంలోని శ్రీనినగర్ కాలని గ్రామపంచాయతీ పరిధిలోని 9మరియు 10వ వార్డు పరిధిలో పాల్వంచ లోని కేటీపిఎస్ కు బొగ్గు రవాణా చేసేందుకు గతంలో రైల్వే ట్రాక్ వేయబడింది. అట్టి రైల్వే ట్రాక్ ద్వారా గతంలో కొన్ని సంవత్సరాల పాటు బొగ్గు రవాణా సాగింది. తదనంతరం బొగ్గు రవాణా కు వేరే ట్రాక్ ను ఏర్పాటు చేయడంతో అదికాస్తా నిరుపయోగంగా మారింది నిరుపయోగంగా ఉన్న రైల్వే ట్రాక్ ను సంబంధిత అధికారులు తొలగించారు. ఇదే అదనుగా భావించిన కొంత మంది భూ భకాసురుల కన్ను కేటీపిఎస్ కు చెందిన రైల్వే ట్రాక్ కు సంబంధించిన భూమి పై ఉపయోగించి, పడింది. ఇంకేముంది తమ తెలివి, పలుకుబడి, డబ్బును ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అట్టి భూమిని యదేచ్ఛగా కబ్జా చేసి ప్లాట్లు గా చేసి, గిరిజనేతరులకు అమ్మి సొమ్ము చేసుకుని, మిగిలిన భూమిలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టారు. 1/70 యాక్ట్ ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు ఇండ్ల స్థలాలు కొనకూడదు, అమ్మకూడదు అనే నిబంధనలు ఉన్నా అవేమీ మాకు కొత్త కాదు అన్నచందంగా రియల్ ఎస్టేట్ మాఫియా. భూమి అమ్మకాలు చేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడే కొం వుంది అధికారులకు కొంత సొమ్ము ముట్ట చెప్పి పాత డేట్ లో ఇంటి ఇంటి నెంబర్లు మంజూరు చేయించుకుని, యదేచ్ఛగా నిర్మాణాలు చేస్తూ, చట్టం మాకు చుట్టం అన్న చందంగా వారి వ్యవహారంపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏజెన్సీ పరిధిలోని ప్రభుత్వ భూమిని కాపాడి ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేసి రియల్ ఎస్టేట్ మాఫియా నుంచి కేటీపీఎస్ కు చెందిన భూమిని కాపాడాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి





# కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధిత మిర్చి రైతులకు సత్వరమే న్యాయం చేయాలి

**గంపలగూడెం, (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

మధిర సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ లో దురదృష్టవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో మిర్చి కాలిపోయిన సందర్భంగా కోల్డ్ స్టోరేజ్ లో మిర్చి దాచు కు న్న నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని ఖమ్మం జిల్లా రైతు సంఘ కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. కోల్డ్ స్టోరేజ్ లో మిర్చి దాచుకున్న ఎక్కువమంది రైతులు( ఎన్టీఆర్ జిల్లా) గంపలగూడెం, తిరువూరు, ఏ కొండూరు మండలాలకు చెందినవారే. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం నాడు సిపిఎం పార్టీ ప్రజా సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా రైతు సంఘ కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదం వల్ల తమ సర్వస్వం కోల్పోయిన మిర్చి రైతులకు ఇన్సూరెన్స్ కంపెనీ జాప్యం చేయకుండా వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని, అప్పటివరకు ఒక్కో రైతుకు తాత్కాలిక సహాయం క్రింద 2000 రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. ఈ అగ్ని ప్రమాద సంఘటన కారణంగా నష్టపోయిన రైతుల పక్షాన పోరాడేందుకు 30 మందితో కూడిన ఒక కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎన్టీఆర్ జిల్లాల సిపిఎం పార్టీ ప్రజా సంఘాల నాయకులు ఎం గోపాల్ రావు, డి నాగేశ్వరరావు, ఎస్ నరసింహారావు, మద్ది రెడ్డి వెంకట్ రెడ్డి, గువ్వల సీతారామిరెడ్డి, బాధిత రైతులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**దండేపల్లి ఏప్రిల్ -05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు దండేపల్లి మండలం పెద్దపేట గ్రామపంచాయతీ లో. రాజ కాలనీకి చెందిన బాలే భూమయ్య భార్య లక్ష్మి ఇటీవల మరణించగా ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయలు మరియు 50 కిలోల బియ్యం అందించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండారి వెంకటేష్ జాడి రమేష్ కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా ఈస్టర్ వేడుకలు మృత్యుంజయుడైన క్రీస్తును కొనియాడిన భక్తులు

**హుజూరాబాద్, ఏప్రిల్ 05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**



హుజూరాబాద్ పట్టణంలోని అగాపే అగ్నిజ్వాల మినిస్ట్రీస్ చర్చి లో ఈస్టర్ (పునరుత్థాన పండుగ) వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. లోకరక్షకుడైన యేసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**ప్రారంభ ప్రార్థన మరియు విశిష్టత:**

కార్యక్రమాన్ని డోర్కారాణి నాగిశెట్టి ప్రారంభ ప్రార్థనతో మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఆమె ఈస్టర్ ప్రాముఖ్యతను వివరిస్తూ.. యేసుప్రభువు సమాధిలో లేడు, ఆయన సజీవుడుగా తిరిగి లేచారు అన్న సత్యాన్ని భక్తులకు చాటిచెప్పారు. ఈస్టర్ అనేది ఆశకు, పునరుత్థానానికి ప్రతీక అని ఆమె పేర్కొన్నారు.

**దైవజనుల సందేశం:**

అనంతరం ప్రముఖ దైవజనులు రెవ. దానియేలు నాగిశెట్టి భక్తులకు వాక్యోపదేశం చేశారు. ఈస్టర్ పండుగ క్రైస్తవులందరికీ అత్యంత పవిత్రమైన పర్వదినమని, మృతులలో నుండి తిరిగి లేచిన క్రీస్తు సర్వమానవాళికి నిత్యజీవపు నిరీక్షణను ఇచ్చారని వివరించారు. ప్రేమ, శాంతి, సహనానికి మార్గం చూపిన యేసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరి జీవితాల్లో మార్గదర్శకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

**భక్తుల భాగస్వామ్యం:**

ఈ వేడుకల్లో అగాపే కుటుంబ సభ్యులు, సుమారు 200 మందికి పైగా భక్తులు పాల్గొని ప్రత్యేక కీర్తనలతో ప్రభువును స్తుతించారు. మానవత్వం, క్షమ, సేవా భావనలను



# హామీలు అమలు చేయడం అభినందనీయం : ఎమ్మెల్యే జిఎంఆర్





**పటాన్ చెరు : (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని గెలిచిన వెంటనే అమలు చేయడం అభినందనీయమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డ్ కౌన్సిలర్ సుల్తాన్పురం ఈశ్వరమ్మ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఏర్పాటు చేసిన రెండు రూపాయలకే మినరల్ వాటర్ ప్లాంట్ ను ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఆయన మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ప్రజలు ఎంతో నమ్మకంతో బిఆర్ఎస్ పార్టీకి అధికారం అందించారని.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అతి త్వరలో మున్సిపల్ పరిధిలో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమైనట్లు తెలిపారు. ప్రతి వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి. ఆయా వార్డుల కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ వద్దు - ప్రజా జీవనానికి ముప్పు తెచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

## చెల్పూర్ సర్పంచ్ వంతడుపుల కస్తూరి రఘు

**హుజూరాబాద్ ఏప్రిల్ 05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని సిర్సపల్లి గ్రామ పరిసరాల్లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసనలు ఉధృతమవుతున్నాయి. ఈ నిర్మాణాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్ పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం చెల్పూర్ గ్రామ సర్పంచ్ వంతడుపుల కస్తూరి రఘు సందర్శించి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

**తీర్మానం కాపీ అందజేత:**

డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ చెల్పూర్ గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం కాపీనిఈ సందర్భంగా దీక్షా కమిటీ సభ్యులకు సర్పంచ్ అందజేశారు. చెల్పూర్ గ్రామ ప్రజలందరూ ఈ పోరాటంలో వెన్నంటి ఉంటారని, అవసరమైతే పెద్ద ఎత్తున దీక్షా శిబిరంలో పాల్గొని నిరసన తెలియజేస్తామని కమిటీకి స్పష్టం చేశారు.

**ప్రజా ఆరోగ్యంపై ప్రభావం:**

దీక్షా శిబిరంలో సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. “ఈ డంపింగ్ యార్డ్ నిర్మిస్తే సిర్సపల్లితో పాటు సుమారు 25 కిలోమీటర్ల మేర ఉన్న గ్రామాలు, పరిసర ప్రాంతాలన్నీ కలుషితమై స్మశాన వాటికల్లా మారుతాయి. గాలి, నీరు కలుషితమై ప్రజలు భయంకరమైన రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అభివృద్ధి పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం తగదు అని హెచ్చరించారు.

**ఉద్యమ కార్యాచరణ:**

ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా చేపట్టిన ఈ డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా ముందుకు వెళితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెల్పూర్ గ్రామ ప్రముఖులు, దీక్షా కమిటీ సభ్యులు మరియు ప్రభావిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.





# యువకులకు, స్కూల్ విద్యార్థులకు క్రికెట్ బ్యాట్స్ పంపిణీ

**సుల్తానాబాద్, ఏప్రిల్-05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామం వేసవి కాలం లో యువకులకు ,పిల్లలకి ఉపయోగకరం గా ఉండాలని కాట్నపల్లి యువ నాయకులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ వేసవి కాలం లో యువత, పిల్లలు మొబైల్ ఫోన్ల పైన కాకుండా ఆటలపైన దృష్టి పెట్టాలని అన్ని కాలనీల యూత్ కి క్రికెట్ బ్యాట్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మనోజ్ గౌడ్, మాట్లాడుతూ నేటి యువత క్రీడలకు దూరం అవుతున్నారని వారికి మొబైల్ ఫోన్ల పైన దృష్టి ఎక్కువ ఉండటం వలన చెడు వ్యసనాలకు గురి అవుతున్నారని యువత వ్యసనాలకు దూరం ఉండాలని గ్రామీణ క్రీడలకి దగ్గర అవ్వాలని వారి కోసం ఎలాంటి సహాయ సహకారాలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాట్నపల్లి యువకులు, స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..





# తాళ్ల పేట ముస్లిం మైనార్టీ నూతన కమిటీ ఎన్నిక

**దండేపల్లి ఏప్రిల్-05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

దండేపల్లి మండలంలోని తాళ్లపేట ముస్లిం మైనార్టీ గ్రామ కమిటీని ఆదివారం జామా మసీదులో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా మహమ్మద్ ముస్తఫా, ఉపాధ్యక్షులుగా ఖాదర్, ప్రధాన కార్యదర్శిగా దావూద్ ఖాన్, సంయుక్త కార్యదర్శిగా శరీఫ్, క్యాషియర్ గా హైదర్ ఖాన్, ముఖ్య సభ్యులుగా ఉస్మాన్ ఖాన్ (జామా మసీదు అధ్యక్షులు), షఫీయోద్దీన్( మస్జిద్- ఏ - ఫాతిమా అధ్యక్షులు), అలీమ్ ఖాన్ ( ఖబ్రస్తాన్ కమిటీ అధ్యక్షులు), సోహైల్ ఖాన్ ( యూత్ కమిటీ అధ్యక్షులు)ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ రంజాన్ నెలలో హాఫీజ్ లకు రెండు మసీదులకు రూ. 10 వేల చొప్పున అందిస్తానన్నారు. శుభ, అశుభ కార్యాలకు రూ. 5 వేల చొప్పున ప్రతి కుటుంబానికి అందిస్తానన్నారు. రెండు మసీదులు, ఈద్గా, ఖబ్రస్తాన్ అభివృద్ధికి తోడ్పడతానన్నారు. ఎన్నికల అధికారిగా సీనియర్ జర్నలిస్ట్ నిజాం వ్యవహరించారు.





# ఆడబిడ్డల్ని- పర్యావరణాన్ని కాపాడితేనే దేశం అభివృద్ధి చెందుతుంది

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

భద్రాచలం పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన" బాలికల విద్యా ఆరోగ్య పరిరక్షణ "సదస్సు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం ఎంఈఓ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి రమ గారు పాల్గొని ప్రతి విద్యార్థి జీవితంలో సుప్రీంకోర్టు సలహాలు సూచనలు ప్రభుత్వాలు పాటించి నెలసరి కార్యక్రమానికి అవసరమైన శానిటేషన్ నాప్కిన్సును మొత్తం 5000 మంది విద్యార్థులకు సంవత్సరానికి కావలసిన బయోడేబుల్ శానిటేషన్ ప్యాడ్స్ ను విద్యార్థిని విద్యార్థులకు మహిళలకు ఉచితంగా అందజేసి మనమందరం కనీస బాధ్యతగా ఇచ్చి వారికి ఆరోగ్యం పట్ల సరైన అవగాహన కల్పించి దేశ అభివృద్ధిలో ఆడబిడ్డల అభివృద్ధి చాలా కీలకమైనది ఎంత గొప్ప నిర్ణయాన్ని ప్రపంచ పర్యావరణ సంస్థ తీసుకొని పనిచేయడం శుభపరిణామం అన్నారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు జాతీయ కార్యదర్శి కళాసాగర్, ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర, ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి, జాతీయ కార్యదర్శి సాగర్, సహాయ కార్యదర్శి ఉపేందర్ యాదవ్ ఉపాధ్యక్షురాలు శిల్పిక, రాష్ట్ర కార్యదర్శి క్రాంతి నాయుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు శ్యామ్ నాయుడు, పాల్వంచ పట్టణ అధ్యక్షురాలు శ్వేతా




నాయుడు , మణుగూరు మండల అధ్యక్షులు సైదా బాబు నాయుడు,రాష్ట్ర కోఆర్డినేటర్ శివ, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ భారత్ ,వంశీ ,అద్వీత్ లక్ష్మణ్, పర్యావరణ కార్యకర్తలు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు..

# ఉద్యోగులు రిటైర్మెంట్ అనంతరం సామాజిక సేవ చేయాలి

**రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల**

**కార్మిక నాయకులు దెంచనాల రాంబాబు పదవి విరమణ**

**సన్మాన సభలో పాల్గొన్న కొత్వాల దంపతులు**

**ఉద్యోగులు పదవి విరమణ అనంతరం సామాజిక సేవ చేయాలి అని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్) 05.**

పాల్వంచ కేటీపీస్ కర్మాగారంలో ఓ &ఎం , 5, 7 దశలలో 30 సంవత్సరాలు కార్మిక నాయకునిగా పని చేసి రిటైర్మెంట్ అయినా దెంచనాల రాంబాబుకు పాల్వంచ మండల జగన్నాధపురంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల తోపాటు ఆయన సతీమణి 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి లు పాల్గొని, రాంబాబుకు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కొత్వాల మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల రాంబాబు చూపెట్టిన చొరవను కొనియాడారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కేటీపీస్ ట్రవీక్స్ యూనియన్ నాయకులు చారుగుండ్ల రమేష్, తోట కోటేశ్వరరావు, రాసురి శ్రీనివాస్, ముత్యాల రాంబాబు, ధర్మరాజుల నాగేశ్వరరావు, కె రవి కుమార్, నాదెండ్ల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# నిన్న జరిగిన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నిక పూర్తిగా అప్రజాస్వామికం

**- యాచారం మండల మాజీ ఎంపీపీ రాచర్ల.వెంకటేశ్వర్లు**

**ఇబ్రహీంపట్నం, 05 ఏప్రిల్ (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

రంగారెడ్డి జిల్లా, యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్కు. నరసింహ్మా అధ్యక్షతన ఏర్పాటుచేసిన పత్రిక సమావేశములో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. గత 51 రోజులుగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నిక వాయిదా పడిన సంగతి తెలిసిందే అయితే శనివారం కాంగ్రెస్ పార్టీ కౌన్సెలర్స్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను బి ఆర్ ఎస్ పార్టీ కి చెందిన కొంత మంది కౌన్సిలర్ల పైన కొన్ని అభియోగాలు లు ఉన్నందున వారిపైన పిర్యాధులు ఉన్నందున వారిపైన తీర్పు వచ్చేవరకు ఎన్నికను వాయిదావేయమని ఎన్నికల అధికారులను కోరగా ఎన్నికను చేస్తామని అధికారులు చెప్పడముతో మా కాంగ్రెస్ పార్టీ కౌన్సెలర్స్ వాక్ అవుట్ చేయడము జరిగింది. తదనంతరం మాజీ ఎమ్మెల్యే తనయుడు మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ( బంటీ ) ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని ఉద్దేశించి తొడలు కొడుతూ మాట్లాడుతూ.బిడ్డ , కొడకా, అరేయ్ లాంటి పదాలు అనడుము మీ అహంకారానికి నిదర్శనము అని మీ తండ్రి వయసుకు సమానములు అయినా మా ఎమ్మెల్యే ని అనే స్థాయి మీది కాదు అని , బంటీ మీరు మా ఎమ్మెల్యే కి బే షరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము మాజీ ఎమ్మెల్యే మీ స్వంత గ్రామములో సర్పంచ్ గ సహకార బ్యాంకు చైర్మన్ గ కూడా ఓడిపోయినా మీరు మా ఎమ్మెల్యే ని విమర్శించే నైతిక హక్కు మీకు లేదు మీ కొడుకును మీరు కంట్రోల్లో పెట్టుకోవాలని హెచ్చరిస్తున్నము అని అన్నారు . రంగారెడ్డి జిల్లా లోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గము లో ప్రజలు నలభై వేలకు పై చిలుకు మెజారిటీతో గెలిపించి ఇబ్రహీంపట్నం గడ్డ కాంగ్రెస్ పార్టీ అడ్డా అని నిరూపించారని మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికలలో కూడా కేవలము 35 ఓట్ల లోపు ఐదుగురు కౌన్సిలర్లను కోల్పోవడము జరిగింది .మొత్తము మీద బిఆర్ఎస్ పార్టీ ఓటు బ్యాంకు కంటే మూడువేల ఐదువందల ఓట్లు ఎక్కువగానే ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ఇబ్రహీంపట్నం లో బలంగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సారథ్యములో నియోజకవర్గము లో పలు అభివృద్ధికార్యక్రమాలు జరుగుతున్నాయని తెలియచేసారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుండ్ల వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాం అక్బర్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికారప్రతినిధి వరికుప్పల సుధాకర్ , సర్పంచ్ లు ముచ్చర్ల సుగుణ సంపత్ , సపావత్ కిషన్ నాయక్ , కిసాన్ సెల్ మండల్ ప్రెసిడెంట్ లిక్కి పాండురంగారెడ్డి, బి సి సెల్ మండల్ ప్రెసిడెంట్ వరికుప్పల తిరుమలేశ, నాయకులూ దేంది రవీందర్ రెడ్డి , నర్రె శ్రీశైలం , డి జె యాదగిరి , సాయాజిద్ దేవీసింగ్ తదితరులు పాల్గొన్నారు.



# బయ్యారం ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా సంకపల్లి సుమన్ రెడ్డి,ధారావత్ వెంకట్రామ్

**బయ్యారం,(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్) ఏప్రిల్ 5.**

బయ్యారం ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల కేంద్రంలో రిజిస్ట్రేషన్ 348/2021 ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్ నాయిని ఇంద్రారెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.మూడోసారి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా (వార్త రిపోర్టర్) సంకపల్లి సుమన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా దారావత్ వెంకట్రామ్,ఉపాధ్యక్షుడిగా బానోత్ స్వామి,సహాయ కార్యదర్శిగా చామర్తి వినయ్ కుమార్,కోశాధికారిగా భూక్యా మంగుతో పాటు గౌరవ సలహాదారులుగా షేక్ జీలాని,నాయిని ఇంద్రారెడ్డి ని సభ్యులంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం నూతన ప్రెస్ క్లబ్ కమిటిని షేక్ యుసాఫ్ పాషా,రామసహాయం ప్రకాష్ రెడ్డి,కేస మునీందర్,పాముల విద్యాసాగర్,సపవత్ సంతోష్,కపిల్ చౌదరి నీలారపు సంపత్ యాదవ్ లు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సుమన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని విధాలుగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని అన్నారు. తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న క్లబ్ సభ్యులందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమించాలి

**- షేక్.మీరా టీపీటీఫ్ మండల మాజీ అధ్యక్షులు.**

**బయ్యారం,(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్) ఏప్రిల్ 5.**

బయ్యారం మండల కేంద్రంలో గల విజయలక్ష్మి టైల్స్ ఫ్యాక్టరీలో ఐఎఫ్ టీయు జిల్లా జనరల్ కౌన్సిల్ యాకయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు.ఈ కౌన్సిల్ లో టీపీటీఫ్ బయ్యారం మండల మాజీ అధ్యక్షులు షేక్.మీరా పాల్గొని మాట్లాడుతూ నేడు దేశంలో కార్మికుల పరిస్థితి చాలా దీనమైన స్థితిలో ఉన్నదని,దీనికి కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం అని ఆయన అన్నారు.ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న 44 కార్మిక చట్టాలలో 15కార్మిక చట్టాలను రద్దు చేసి 29కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా సవరణ చేసిందని,ఈ కార్మిక చట్టాల సవరణ వల్ల దేశంలోని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 40 కోట్లకు పైగా ఉన్న కార్మికులకు తీవ్రనష్టం కలిగించే విధంగా ఉన్నాయని అన్నారు.కార్మిక వర్గ ప్రయోజనాలు విస్మరించిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారస్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరణ చేసిందని అన్నారు.దేశంలోని యావత్ కార్మిక వర్గం కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని,అలాగే కార్మికులకు తీవ్రనష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు ఉద్యమించాలని అన్నారు. ఎందరో కార్మికుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరణ చేయడం దుర్మార్గమైనదని, ఎనిమిది గంటల పనిదినాన్ని పన్నెండు గంటల పనిదినంగా కేంద్ర ప్రభుత్వం చేసిందని అన్నారు.దేశంలో కార్మిక వర్గం చేసే పోరాటాలకు టీపీటీఫ్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు.




# తెలంగాణ టీడీపీ మండల అధ్యక్షుడిగా కాటమోని రాఘవేందర్ గౌడ్

**పెబ్బేరు ఏప్రిల్05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

తెలంగాణ తెలుగుదేశం పార్టీ పెబ్బేరు మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నికల పరిశీలకులు తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రామన్ గౌడ్,జిల్లా నాయకులు వాకిటి బాలరాజు ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుడి ఎన్నిక మంగళవారం మండల కేంద్రంలో చేపట్టారు.అధ్యక్షులుగా కాటమోని రాఘవేందర్ గౌడ్,ఉపాధ్యక్షులు ఖయూమ్,ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కార్యనిర్వాహన కార్యదర్శులు దామోదర్,హనీఫ్,రంగాపురం కావలి కురుమన్న,కార్యదర్శులుగా పల్లెమోని బీసన్న,వడ్డే రామకృష్ణ,మురళీగౌడ్,కోశాధికారి కోమటి రాజు,కార్యవర్గ సభ్యులుగా తిరుపతయ్య గౌడ్,శాంతయ్య,శంకర్,పురేందర్,పెబ్బేరు మండల తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులుగా బి నాగేంద్రం యాదవ్,తెలుగు యువత అధ్యక్షులుగా తిరుమలేష్,మైనార్టీ అధ్యక్షులుగా ఎంఎ అలిమ్,జానీ,తెలుగు విద్యార్థి అధ్యక్షులుగా కే.శారిషా తదితరులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి రంగంలో మహిళలను అభివృద్ధి పరచిన ఘనత టీడీపీదేనని కొనియాడారు.పార్టీకి పూర్వవైభవం తెచ్చి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి పార్టీని బలోపేతం చేయడం కోసం కృషి చేస్తానని పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు.తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకులకు మరియు జిల్లా,మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఆర్టిజన్ల ధర్నా డిమాండ్లు తీర్చకపోతే సమ్మె

**బయ్యారం, (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్) ఏప్రిల్ 5.**

విద్యుత్ శాఖలో ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్నా వారికీ తగినంత గుర్తింపు లేదని విద్యుత్ శాఖలో ఆర్టిజన్స్ కు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ తో కూడినటువంటి కన్వర్షన్ వర్తింప చేయాలని అలాగే అన్మాడ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి విలీనం చేసుకోవాలని స్పాట్ బిల్డర్స్ ని 30 రోజుల పని దినముల వేతనం కల్పించాలని అలాగే వివిధ కారణాలవల్ల ఆర్టిజన్స్ కాకుండా మిగిలిన పోయిన వారిని ఆర్టిజన్స్ గా గుర్తించాలని గత 26,30తారీకుల రోజున డివిజన్ ఆఫీసు ముందు ధర్నా మరియు ఏప్రిల్ 2 తేదీన ధర్నా వంట వార్పు కార్యక్రమాలు చేపట్టారు. అయినా యాజమాన్యం ప్రభుత్వం స్పందించలేదు కావున ఏప్రిల్ 7 తారీఖున ఎస్పిడిసియల్ ఆఫీస్ ఆవరణలో ధర్నా కార్యక్రమం 8 తారీకు నుండి సమ్మెలో పాల్గొనేందుకు వాల్ పోస్టర్ వివిధ కార్యాలయల వద్ద అతికించారు.



# నేడే బిజెపి ఆవిర్భావ దినోత్సవం

## 26వ వార్డు కౌన్సిలర్ విజయ్

**(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్) వనపర్తి జిల్లా ప్రతినిధి**

26 వార్డు కౌన్సిలర్ విజయ్ కుమార్ ఇంటిపై జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెంటపల్లి పురుషోత్తం రెడ్డి కేంద్రంలోని బీజేపీ నాయకులు వారి ఇళ్లపై ఆదివారం బీజేపీ పార్టీ జెండా ఎగరవేయడం జరిగింది.ఈ నెల 6వ తేదీన బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, వనపర్తి జిల్లా బీజేపీ అధ్యక్షులు డి.నారాయణ ఆదేశానుసారం ఇళ్లపై పార్టీ జెండా ఎగరవేశామని బీజేపీ శ్రేణులు తెలిపారు. రేపు బీజేపీ పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు.



# డ్రోన్ దాడి ఫొటో షేర్ చేశాడని... బ్రిటీష్ విమాన సహాయకుడి అరెస్ట్

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

దుబాయ్‌లో పనిచేస్తున్న 25 ఏళ్ల బ్రిటీష్ ఫ్లైట్ అటెండెంట్‌ను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. ఇరాన్ డ్రోన్ దాడికి సంబంధించిన ఫొటోను వాట్సాప్ గ్రూపులో షేర్ చేయడమే ఇందుకు కారణమైంది. యూఏఈలోని సైబర్ చట్టాలు ఎంత కఠినంగా ఉంటాయో తెలిసిందే.వివరాల్లోకి వెళితే, స్థానిక విమానయాన సంస్థలో క్యాబిన్ క్రూ సభ్యుడిగా పనిచేస్తున్న ఈ యువకుడు, మార్చి 7న దుబాయ్ విమానాశ్రయం సమీపంలో జరిగిన డ్రోన్ దాడి డ్యామేజీని ఫొటో తీశాడు. ఆ ఫొటోను తన సహోద్యోగులతో ఉన్న ప్రైవేట్ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేస్తూ, 'విమానాశ్రయంలోకి వెళ్లడం సురక్షితమేనా?' అని ప్రశ్నించాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, దేశ భద్రతకు భంగం కలిగించే కంటెంట్‌ను షేర్ చేశారనే ఆరోపణలతో అరెస్ట్ చేశారు. యూఏఈ కఠిన సైబర్ క్రైమ్ చట్టాల ప్రకారం, అతను దోషిగా తేలితే రెండేళ్ల వరకు జైలు శిక్ష, 200,000 దిర్హామ్‌లు (సుమారు రూ.50 లక్షలు) జరిమానా, దేశ బహిష్కరణ శిక్ష పడే అవకాశం ఉంది.ఇది ఒక్కరికే పరిమితమైన సంఘటన కాదని తెలుస్తోంది. ఫిబ్రవరి 28 నుంచి ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, డ్రోన్ దాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసినందుకు డజన్ల కొద్దీ బ్రిటన్ పౌరులను అరెస్ట్ చేశారు. వీరిలో పర్యాటకులు, ఉద్యోగులు కూడా ఉన్నారు. 'డిటైన్డ్ ఇన్ దుబాయ్' అనే హక్కుల సంస్థ అంచనా ప్రకారం, ఇప్పటివరకు సుమారు 70 మంది బ్రిటన్ పౌరులు ఇలాంటి కేసుల్లో చిక్కుకున్నారు.ఆన్‌లైన్‌లో ఇప్పటికే విస్తృతంగా ప్రచారంలో ఉన్న ఫొటోలను రీపోస్ట్ చేయడం సురక్షితమని చాలామంది భావిస్తారని, కానీ యూఏఈలో అది చాలా ప్రమాదకరమని 'డిటైన్డ్ ఇన్ దుబాయ్' సీఈఓ రాధా స్టిర్లింగ్ హెచ్చరించారు. మరోవైపు, బ్రిటీష్, ఇండియన్ రాయబార కార్యాలయాలు కూడా తమ పౌరులకు సున్నితమైన భద్రతా చిత్రాలను తీయవద్దని, పంచుకోవద్దని అత్యవసర సూచనలు జారీ చేశాయి.

# కడప జిల్లాలో కాలి బూడిదైన ఆర్టీసీ బస్సు... తప్పిన పెను ప్రమాదం

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

వైఎస్ఆర్ కడప జిల్లాలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఓ ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగగా, డ్రైవర్ వేగంగా స్పందించడంతో అందులో ఉన్న 21 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన వేంపల్లి మండలం వీరన్నగట్టుపల్లి సమీపంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 21 మంది ప్రయాణికులతో వేంపల్లి నుంచి కదిరికి బయలుదేరింది. వీరన్నగట్టుపల్లి వద్దకు రాగానే, రోడ్డుకు అడ్డంగా తక్కువ ఎత్తులో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు బస్సు పైభాగానికి తగిలాయి. దీంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. బస్సు లోపల పొగలు, మంటలు గమనించిన ప్రయాణికులు భయంతో కేకలు వేశారు.వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. ప్రయాణికులందరినీ హుటాహుటిన కిందకు దించారు. వారు దిగిన కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తానికి వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే, అప్పటికే బస్సు కాలి బూడిదైంది.విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడటమే ఈ దుర్ఘటనకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై వేంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# జగన్ దీనికేమని సమాధానం చెబుతారు?: కన్నా లక్ష్మీనారాయణ

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

వైసీపీ అధినేత జగన్ పై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతి రాజధాని నిర్మాణ వ్యయంపై జగన్ ఉద్దేశపూర్వకంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విశాఖపట్నంలోని రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ ఖర్చుతో పోలుస్తూ ఆయన కొన్ని సంచలన లెక్కలను బయటపెట్టారు."ఆంధ్రుల కోసం కడుతున్న రాజధానికి చదరపు అడుగుకి రూ.12,000 అవుతుందని జగన్ అబద్ధాలు చెబుతున్నారు. అలాంటప్పుడు తన విలాసాల కోసం కట్టిన రుషికొండ ప్యాలెస్‌కు ఇంత భారీగా ఎందుకు ఖర్చు చేశారు? దీనికి జగన్ ఏం సమాధానం చెబుతారు?" అని కన్నా లక్ష్మీనారాయణ నిలదీశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, రాజధాని విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు.అమరావతి నిర్మాణానికి చదరపు అడుగుకు అయ్యే ఖర్చు కేవలం రూ.6,985 మాత్రమేనని కన్నా పేర్కొన్నారు. అదే సమయంలో, జగన్ తన సొంత విలాసాల కోసం కట్టించుకున్న రుషికొండ ప్యాలెస్‌కు చదరపు అడుగుకు రూ.35,714 ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. ఈ వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. అంతేకాదు, పోలిక కోసం ఆయన తెలంగాణ కొత్త సచివాలయానికి చదరపు అడుగుకు రూ.6,500, ఢిల్లీలోని కొత్త పార్లమెంటు భవనానికి రూ.17,291 ఖర్చయిందని వివరించారు.

# జగన్‌పై మంత్రుల ఫైర్.. తుగ్లక్‌తో పోలుస్తూ తీవ్ర విమర్శలు

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తొస్తోందని పార్థసారథి వ్యంగ్యాస్త్రాలు సంధించగా, విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదని అచ్చెన్నాయుడు అన్నారు.మంగళగిరిలో మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ.. "తుగ్లక్ పేరు వినడమే తప్ప చూడలేదు. కానీ, జగన్‌ను చూస్తే ఆయనే గుర్తొస్తున్నారు. మూడు రాజధానుల పేరుతో ఆయన మూడు ముక్కలాట ఆడారు. తాను చెప్పిందే అందరూ వినాలనే ధోరణి వల్లే ప్రజలు ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారు" అని మండిపడ్డారు. చంద్రబాబుపై నమ్మకంతోనే రైతులు రాజధానికి భూములు ఇచ్చారని, అవమానించిన వైసీపీకి భవిష్యత్తులో పుట్టగతులుం డవని హెచ్చరించారు.

# కోల్ కతాపై దాడి చేస్తామన్న పాక్ మంత్రి వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ మండిపాటు

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

భారత్‌తో భవిష్యత్తులో ఏదైనా ఘర్షణ జరిగితే, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాపై దాడి చేస్తామంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన హెచ్చరికలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. భారత్ ఒక 'ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్'కు ప్లాన్ చేస్తోందని కూడా ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ సహా పలు భారత రాజకీయ పార్టీలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి.ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఖవాజా ఆసిఫ్, "భారత్ తమ ఆధీనంలో ఉన్న పాకిస్థానీల ద్వారా లేదా తమ సొంత మనుషులతోనే ఎక్కడో మృతదేహాలను ప్లాంట్ చేసి, వారిని ఉగ్రవాదులుగా చిత్రీకరించి ఒక ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్‌కు కుట్ర చేస్తోంది. ఈసారి అలాంటి నాటకానికి ప్రయత్నిస్తే, దేవుడి దయ వల్ల మేం దానిని కోల్‌కతా వరకు తీసుకెళతాం" అని హెచ్చరించారు.పాక్ మంత్రి వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ తీవ్రంగా ఖండించారు. ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్లలో పాకిస్థాన్ 'పీహెచ్‌డీ' చేసిందని ఆయన ఎద్దేవా చేశారు. "దక్షిణాసియాలో ఉగ్రవాదానికి ఏదైనా కేంద్ర స్థానం ఉందంటే అది పాకిస్థానే. అలాంటిది ఇతరులపై నిరాధార ఆరోపణలు చేస్తూ పాక్ తనను తానే అపహాస్యం చేసుకుంటోంది" అని ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ విమర్శించారు.బీజేపీ అధికార ప్రతినిధి ప్రతుల్ షా డియో కూడా ఘాటుగా స్పందించారు. గతేడాది జరిగిన 'ఆపరేషన్ సిందూర్'ను పాకిస్థాన్‌కు గుర్తు చేశారు. "ఆపరేషన్ సిందూర్‌లో వారి భూభాగంలోకి వెళ్లి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ఎలా నాశనం చేశామో వారు మర్చిపోయి ఉండరనుకుంటున్నా. కాల్పుల విరమణ కోసం పాకిస్థాన్ మమ్మల్ని వేడుకుంది. కోల్‌కతా వారికి అందని ద్రాక్ష. మేం తలుచుకుంటే పాకిస్థాన్‌లోని ఏ ప్రాంతంలోనైనా దాడి చేయగలం" అని ఆయన స్పష్టం చేశారు. జేడీ(యూ) నేత నీరజ్ కుమార్ సైతం పాక్ మంత్రి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు.

# జగన్ పేరు కూడా అలాంటిదే: మంత్రి కొలుసు పార్థసారథి

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

"గ్రామాల్లో శుభకార్యాల సమయంలో అమంగళకరమైన పేర్లు పలకకూడదని ఒక సంప్రదాయం ఉంటుంది. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 'జగన్' అనే పేరు కూడా అలాంటిదే" అంటూ రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు చేశారు. రాజధాని అమరావతి విషయంలో జగన్ అనుసరించిన వైఖరి రాష్ట్రానికి తీరని నష్టం చేసిందని, ఆయనొక అభివృద్ధి నిరోధక శక్తి అని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ తన కొత్త రాజధాని ప్రతిపాదనతో రాష్ట్ర ప్రజల ముందు నవ్వులపాలయ్యారని, సొంత పార్టీ శ్రేణులే ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయని అన్నారు.

### జగన్... రాష్ట్రానికి పట్టిన చీడ

రాష్ట్రానికి రాజధాని నిర్మాణం ఒక గొప్ప సంబరం లాంటిదని, అలాంటి సమయంలో జగన్ 'కంటిలో నలుసులా', 'రాష్ట్రానికి పట్టిన చీడపీడలా' తయారయ్యారని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు తెలిపితే, ఒక్క వైసీపీ మాత్రమే పార్లమెంటులో వాకౌట్ చేసి రాష్ట్ర ప్రయోజనాలకు గండికొట్టిందని గుర్తుచేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాల్సిన రాజధాని విషయంలో జగన్ వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని విమర్శించారు. ఆయన పాలనలో రాష్ట్రం ఐదేళ్ల పాటు చీకటి రోజులను చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### వికేంద్రీకరణ పేరుతో చారిత్రక తప్పిదం

2019–24 మధ్య జగన్ చెప్పిన 'అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదం శుద్ధ అబద్ధమని పార్థసారథి స్పష్టం చేశారు. "అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు ప్రకటించి, అధికారంలోకి రాగానే మాట మార్చారు. సూట్‌కేసు రాజకీయాలు చేస్తూ రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారు. ప్రజలు ఈ నాటకాన్ని గమనించి, మూడు రాజధానుల ఆలోచనను ఛీత్కరించి కేవలం 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవా చేశారు. చేసిన తప్పులను ఒప్పుకోకుండా, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకుండా తన ఆలోచనలనే రుద్దే నియంతలా జగన్ వ్యవహరించారని మండిపడ్డారు. రాజధాని పేరును 'మావిగన్'గా మార్చాలని చూడటం ఆయన 'తుగ్లక్' పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

### అమరావతి.. ఐదు కోట్ల మంది ఆత్మగౌరవం

విభజనతో నష్టపోయిన ఆంధ్రులకు అమరావతి ఒక ఆత్మగౌరవ ప్రతీక అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. "ఏ నాయకుడూ చేయలేని సాహసాన్ని చంద్రబాబు చేశారు. ఆయన ఒక్క పిలుపుతో రైతులు 34,000 ఎకరాల విలువైన భూములను రాజధాని కోసం త్యాగం చేశారు. అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్'. ఈ రోజు హైదరాబాద్ తెలంగాణకు లక్షల కోట్ల ఆదాయాన్ని అందిస్తోంది. అదే స్థాయిలో అమరావతి అభివృద్ధి చెందితే, ఏటా వచ్చే 4–5 లక్షల కోట్ల ఆదాయంతో రాష్ట్రంలోని ప్రతీ మూలను అభివృద్ధి చేయవచ్చు" అని వివరించారు. అమరావతిలో పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని ఆయన స్పష్టం చేశారు.

### కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

గత 20 నెలల కూటమి పాలనలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టిందని పార్థసారథి తెలిపారు. వైసీపీ ప్రభుత్వం సాధించలేకపోయిన వేల కోట్ల రూపాయల కేంద్ర నిధులను సాధించి ప్రజా సంక్షేమానికి వినియోగిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించి సమగ్రాభివృద్ధి చేస్తున్నామన్నారు. కర్నూలుకు కారిడార్, ప్రకాశం–నెల్లూరు జిల్లాల్లో పోర్టులు, రిఫైనరీ, విశాఖను డేటా సెంటర్, సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. "పెట్టుబడిదారులు వసతులు, కనెక్టివిటీ ఉన్న చోటుకే వస్తారు. జగన్‌లా 'చెట్టు కింద కూర్చుని చర్చలు జరపండి' అంటే ఎవరూ రారు" అని ఆయన ఎద్దేవా చేశారు. అప్పులు తెచ్చినా, సంపద సృష్టించి వాటిని తీర్చే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందని, జగన్ ఇప్పటికైనా అబద్ధాలు మాని వాస్తవాలు గ్రహించాలని హితవు పలికారు.

# ఇది జగన్ కొత్త ఆలోచన కాదు.. 11 ఏళ్ల క్రితమే చంద్రబాబు చెప్పారు: పట్టాభి

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ప్రాంతాలను కలుపుతూ 'మావిగన్' పేరిట గ్రోత్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నేత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రంగా స్పందించారు. జగన్ ఇప్పుడు చెబుతున్నది కొత్త ఆలోచన కాదని, 11 సంవత్సరాల క్రితమే నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఈ ప్రణాళికకు శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమకు ఎవరూ అభివృద్ధి పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, ఏ ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసని పట్టాభి వ్యాఖ్యానించారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్ లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

### 11 ఏళ్ల క్రితమే చంద్రబాబు విజన్

2014లో రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రచించారని పట్టాభి గుర్తుచేశారు. ఇందులో భాగంగానే 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించి, క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ)ను ఏర్పాటు చేశారని తెలిపారు. దాదాపు 8,350 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో సీఆర్డీఏను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మచిలీపట్నం సమీపంలోని మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల నుంచి గుంటూరు దాటి ఎడ్లపాడు వరకు సీఆర్డీఏ పరిధి విస్తరించి ఉందని, ఈ మ్యాప్ చూస్తే చంద్రబాబు దార్శనికత ఏమిటో అర్థమవుతుందని అన్నారు. "ఇప్పుడు జగన్ గారు చెబుతున్న గ్రోత్ కారిడార్ ఆలోచన 2015 సెప్టెంబర్ 22న జారీ చేసిన జీవో నంబర్ 207లోనే ఉంది. మచిలీపట్నం నుంచి ఎడ్లపాడు వరకు ఉన్న ప్రాంతమంతా అభివృద్ధి చేయాలనేది చంద్రబాబు నాటి ప్రణాళిక" అని పట్టాభి పేర్కొన్నారు.

### సీఆర్డీఏను రద్దు చేయాలని చూసింది మీరు కాదా?

ఈ ప్రాంతంపై ఇప్పుడు కొత్తగా ప్రేమ చూపిస్తున్న జగన్మోహన్ రెడ్డి, 2020లో ఇదే సీఆర్డీఏ చట్టాన్ని రద్దు చేసేందుకు ఎందుకు ప్రయత్నించారని పట్టాభి ప్రశ్నించారు. మూడు రాజధానుల పేరుతో ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవాలని చూసింది నిజం కాదా అని నిలదీశారు. "ఒకవైపు హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ, ఔటర్ రింగ్ రోడ్డుతో చంద్రబాబు ఎలా అభివృద్ధి చేశారో అందరికీ తెలుసు. అదే తరహా విజన్‌తో ఏపీలో సీఆర్డీఏను ఏర్పాటు చేస్తే, దాన్ని నాశనం చేయాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఇప్పుడు ఓటమి తర్వాత మళ్లీ ఈ ప్రాంతంపై ప్రేమ నటిస్తున్నారు" అని ఆయన విమర్శించారు.

### బిల్లు వేరు.. తీర్మానం వేరు

అమరావతి రాజధానిపై అసెంబ్లీలో తీర్మానం చేసి కౌన్సిల్‌కు ఎందుకు పంపలేదని వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పట్టాభి ఆరోపించారు. బిల్లుకు, తీర్మానానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. "బిల్లు అనేది చట్టరూపం దాల్చాలంటే ఉభయ సభల ఆమోదం తప్పనిసరి. కానీ, తీర్మానం (రెజల్యూషన్) అనేది కేవలం ఒక అభిప్రాయాన్ని వ్యక్తపరచడం కోసం చేసేది. కేంద్ర ప్రభుత్వం ఏపీ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసి పంపమని కోరింది. అందుకే అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాం. ఆ తర్వాత కేంద్రం పార్లమెంటులో బిల్లు పెట్టి ఉభయ సభల్లో ఆమోదింపజేసింది. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన మూడు రాజధానుల అంశం 'బిల్లు' కాబట్టే కౌన్సిల్‌కు వెళ్లింది. కానీ ఇది కేవలం 'తీర్మానం' మాత్రమే," అని ఆయన స్పష్టం చేశారు.

### పార్లమెంటు చట్టాన్ని రాష్ట్రం మార్చలేదు

జగన్మోహన్ రెడ్డి ఎన్ని మాట్లాడినా అమరావతి అభివృద్ధిని ఆపడం ఎవరివల్లా కాదని పట్టాభి అన్నారు. పార్లమెంటులో ఆమోదం పొందిన చట్టాన్ని ఒక రాష్ట్ర అసెంబ్లీ మార్చలేదన్న కనీస అవగాహన లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అమరావతి పనులు వేగంగా ముందుకు సాగుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే సీఎం సమీక్షలు నిర్వహించి పనులకు టార్గెట్లు నిర్దేశించారని, త్వరలోనే రాజధానిలో భవనాలు వేగంగా పైకి లేస్తాయని అన్నారు.

### అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

కూటమి ప్రభుత్వం కేవలం అమరావతికే పరిమితం కాదని, ఉత్తరాంధ్ర, రాయలసీమతో సహా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని పట్టాభి తెలిపారు. ఉత్తరాంధ్రకు ఆర్సెలార్ మిట్టల్, అదానీ డేటా సెంటర్ వంటి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, రాయలసీమకు పరిశ్రమలు తీసుకురావడంతో పాటు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కూడా చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని చెప్పారు. నారా లోకేష్ లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారని, అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# పిక్చర్ అభీ బాకీ హై.. సొంత పార్టీ నేతలకు రాఘవ్ చద్దా స్ట్రాంగ్ కౌంటర్

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

ఆమ్ ఆద్మీ పార్టీలో (ఆప్) అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. తనపై సొంత పార్టీ నేతలు చేస్తున్న విమర్శలపై రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా తీవ్రంగా స్పందించారు. పంజాబ్ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడం లేదన్న ఆరోపణలను తిప్పికొడుతూ, తాను రాష్ట్రం కోసం పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ వీడియో క్లిప్‌ను పంచుకున్నారు. రాజ్యసభలో తాను పంజాబ్ సమస్యలపై మాట్లాడుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి."రాఘవ్ చద్దా పంజాబ్ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడంలో విఫలమయ్యారని వీడియోలు విడుదల చేయమని ఒత్తిడికి గురైన నా సహచరులకు ఇది ఒక చిన్న ట్రైలర్ మాత్రమే... పిక్చర్ అభీ బాకీ హై" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. పంజాబ్ తనకు కేవలం చర్చనీయాంశం కాదని, అది తన ఇల్లు, విధి, మట్టి, ఆత్మ అని ఆయన ఉద్ఘాటించారు.ఇటీవల రాజ్యసభలో ఆప్ ఉప నేత పదవి నుంచి రాఘవ్ చద్దాను తొలగించిన తర్వాత ఈ వివాదం మొదలైంది. పార్టీలో కొందరు నేతలు ఆయనపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. దీనిపై చద్దా శనివారం స్పందిస్తూ, "నాపై మూడు ఆరోపణలు చేశారు. అందులో సున్నా శాతం నిజం ఉంది. నేను మౌనంగా ఉంటే, పదేపదే చెప్పే అబద్ధం కూడా నిజంలా అనిపిస్తుంది" అని పేర్కొన్నారు.తనపై ఒక పక్కా ప్రణాళిక ప్రకారం, పథకం ప్రకారం ప్రచారం జరుగుతోందని చద్దా ఆరోపించారు. "నాపై ఒకే రకమైన ప్రశ్నలు, ఒకే రకమైన ఆరోపణలు వస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు, సమన్వయంతో చేస్తున్న దాడి" అని ఆయన ఒక వీడియో సందేశంలో తెలిపారు. ప్రతిపక్షాలు వాకౌట్ చేసినప్పుడు తాను మద్దతు ఇవ్వలేదన్న వాదనను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. "ఇది పూర్తిగా పచ్చి అబద్ధం. పార్లమెంటు చుట్టూ సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. ఎవరైనా వాటిని తనిఖీ చేసి సమాధానం తెలుసుకోవచ్చు" అని ఆయన సవాల్ విసిరారు.తన పార్లమెంటరీ బాధ్యతలను విస్మరించారని పార్టీలోని ఒక వర్గం ఆరోపిస్తుండగా, తన దృష్టి మొత్తం పంజాబ్, దాని ప్రజల పైనే ఉందని, వారి సమస్యలను రాజ్యసభలో నిరంతరం ప్రస్తావిస్తూనే ఉంటానని చద్దా పునరుద్ఘాటించారు.

# గాయాలతో 7,000 అడుగుల కొండ ఎక్కి... ఇరాన్ సైన్యం కళ్లుగప్పిన అమెరికా పైలట్!

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

అది శత్రువుల అడ్డా. గాల్లో ఎగురుతున్న అమెరికా యుద్ధ విమానం ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్‌ను ఇరాన్ దళాలు కూల్చివేశాయి. అందులోని వెపన్ సిస్టమ్స్ ఆఫీసర్ (సెకండ్ పైలట్) గాయాలతో పారాచూట్ సాయంతో ఇరాన్ పర్వత ప్రాంతంలో దిగాడు. ఒంటరిగా, గాయాలతో ఉన్న అతడికి చుట్టూ శత్రు సైన్యం కదలికలు. ఆ పరిస్థితుల్లో సుమారు 24 గంటలకు పైగా అతను ప్రాణాలతో ఎలా బయటపడ్డాడనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తన శిక్షణ, క్రమశిక్షణ, భూభాగంపై అవగాహనతో అతను ఇరాన్ దళాల కళ్లుగప్పి ప్రాణాలను కాపాడుకున్నాడని సీఎన్ఎన్ తన కథనంలో వెల్లడించింది.విమానం కూలిన వెంటనే ఆ అమెరికన్ అధికారి పర్వతాల మధ్య ఉన్న ఒక గుహలో తలదాచుకున్నాడు. అది తాత్కాలిక రక్షణ మాత్రమే. తనను పట్టుకోవడానికి ఇరాన్ సెర్చ్ బృందాలు ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయని అతనికి తెలుసు. అతని వద్ద ఉన్నది కేవలం ఒక పిస్టల్, కమ్యూనికేషన్ పరికరం, ట్రాకింగ్ బీకన్ మాత్రమే. ఒకేచోట ఉంటే దొరికిపోవడం ఖాయమని భావించి, నిరంతరం తన స్థానాన్ని మార్చుకుంటూ, పొదలు, రాళ్ల మాటున దాక్కుంటూ ముందుకు సాగాడు. మరోవైపు, అతడిని పట్టిచ్చిన వారికి భారీ బహుమతి ఇస్తామని ఇరాన్ అధికారులు ప్రకటించడంతో స్థానిక పౌరులు కూడా గాలింపులో పాల్గొన్నారు. ఇది పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది.అయినా ఆ అధికారి ధైర్యం కోల్పోలేదు. అమెరికా సైన్యం అందించిన సర్వైవల్ ప్రోటోకాల్స్‌ను తూచా తప్పకుండా పాటించాడు. ఎవరి కంటా పడకుండా, సాధ్యమైనప్పుడల్లా తన బృందంతో కమ్యూనికేట్ చేస్తూ, రెస్క్యూ బృందాలకు సిగ్నల్స్ అందించేందుకు అనువైన ప్రదేశాల కోసం వెతికాడు. ఈ క్రమంలో, మెరుగైన సిగ్నల్ కోసం సుమారు 7,000 అడుగుల ఎత్తైన పర్వత శిఖరాన్ని గాయాలతోనే అధిరోహించడం అతని ధైర్యానికి, పట్టుదలకు నిదర్శనం.అతని ట్రాకింగ్ బీకన్ కారణంగా అమెరికా సైన్యం అతని కదలికలను రియల్ టైంలో గమనిస్తూనే ఉంది. ఈ పరిస్థితి అత్యంత తీవ్రమైనదని అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. చివరికి, అమెరికా సైన్యం అత్యంత సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. సీఐఏ సహాయంతో ఇరాన్ దళాలను తప్పుదోవ పట్టించి, కమాండోలు ఆ అధికారి ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. అతనికి ప్రథమ చికిత్స అందించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఆపరేషన్‌లో ఇరాన్ చేతికి చిక్కకుండా రెండు అమెరికా విమానాలను ధ్వంసం చేయాల్సి వచ్చింది. ఈ ఘటనతో అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# వైట్‌హౌస్‌లో పలుకుబడి కోసం.. జెఫ్రీ ఎప్‌స్టీన్‌ను ఆశ్రయించిన అనిల్ అంబానీ!

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి, అమెరికాలో లైంగిక నేరాలకు పాల్పడి సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు మధ్య సన్నిహిత సంబంధాలున్నాయంటూ 'ది న్యూయార్క్ టైమ్స్' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. వైట్‌హౌస్‌లో తనకు మంచి పరిచయాలున్నాయని చెప్పుకొని ఎప్‌స్టీన్.. అనిల్ అంబానీకి దగ్గరయ్యాడని, ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పుడు స్నేహితుడిగా సలహాలు కూడా ఇచ్చాడని ఆ కథనం వెల్లడించింది.అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన ప్రభుత్వంలో భారత-అమెరికా సంబంధాలు, రక్షణ సహకారంపై పట్టు సాధించేందుకు అనిల్ అంబానీ ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ఆయనకు ఎప్‌స్టీన్‌తో పరిచయం ఏర్పడింది. 2017 నుంచి 2019 మధ్య వీరిద్దరి మధ్య వందలాది మెసేజ్‌లు నడిచినట్లు న్యూయార్క్ టైమ్స్ సమీక్షలో తేలింది. "భారత్-అమెరికా సంబంధాలు, రక్షణ సహకారం విషయంలో వైట్‌హౌస్‌తో కలిసి పనిచేయడానికి మీ మార్గనిర్దేశం అవసరం" అని అంబానీ పంపిన మెసేజ్‌కు, తాను "లోపాయికారీ సమాచారం" అందిస్తానని ఎప్‌స్టీన్ బదులిచ్చాడు.ట్రంప్ ప్రభుత్వంలోని కీలక నియామకాలు, విదేశాంగ విధానంపై ఎప్‌స్టీన్ ఎప్పటికప్పుడు అంబానీకి సమాచారం చేరవేసేవాడు. 2017లో భారత రాయబారిగా డేవిడ్ పెట్రియస్‌ను నియమిస్తారా అని అంబానీ అడగ్గా, ఆ ప్రతిపాదన పరిశీలనలో లేదని ఎప్‌స్టీన్ చెప్పాడు. ఆ తర్వాత ఆ పదవి కెన్నెత్ జస్టర్‌కు దక్కింది. అంతేగాక ట్రంప్‌కు అత్యంత సన్నిహితులైన స్టీఫెన్ బ్యానన్, థామస్ బరాక్ వంటి వారితో పరిచయం కల్పిస్తానని కూడా ఎప్‌స్టీన్ ఆఫర్ చేసినట్లు కథనం పేర్కొంది. వీరిద్దరూ 'సిగ్నల్', 'టెలిగ్రామ్' వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా సంభాషించుకునేవారని, అంబానీ 'ఖాతీఘిఅఆ ఘా' అనే హ్యాండిల్‌ను వాడేవారని తెలిసింది. 2019లో అనిల్ అంబానీ వ్యాపారాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినప్పుడు, ఎప్‌స్టీన్ ఆయనకు మానసికంగా ధైర్యం చెబుతూ సందేశాలు పంపాడు. "కేవలం స్నేహితుడిగా మాత్రమే సలహా ఇస్తున్నా, నాకేమీ డబ్బు వద్దు" అని కూడా చెప్పాడు. దీని తర్వాత "లావాదేవీ పూర్తయింది" అని అనిల్ పేరుతో ఎప్‌స్టీన్‌కు ఒక ఈమెయిల్ అందింది. ఆ తర్వాత 2019 మే 23న అంబానీ, మాన్‌హట్టన్‌లోని ఎప్‌స్టీన్ నివాసంలో ఆయన్ను కలిశారు. ఈ భేటీ జరిగిన రెండు నెలలకే.. మైనర్ బాలికలతో లైంగిక, అక్రమ రవాణా ఆరోపణలపై ఎప్‌స్టీన్ అరెస్ట్ అయ్యాడు. ఈ కథనంపై స్పందించేందుకు అనిల్ అంబానీ నిరాకరించినట్లు న్యూయార్క్ టైమ్స్ తెలిపింది.

# బంగ్లాదేశ్ క్రికెట్లో సంక్షోభం... నలుగురు బోర్డు డైరెక్టర్ల రాజీనామా... చివరి వ్యక్తిగానే వెళతానన్న చీఫ్

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. శనివారం ఒక్కరోజే నలుగురు డైరెక్టర్లు రాజీనామా చేయడంతో బోర్డులో ప్రకంపనలు మొదలయ్యాయి. ఆరు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ల బృందంలో ఇప్పటివరకు ఏడుగురు తప్పుకోవడంతో బంగ్లా క్రికెట్ భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది. ఈ పరిణామాల మధ్య, తాను మాత్రం రాజీనామా చేసేది లేదని బీసీబీ అధ్యక్షుడు అమీనుల్ ఇస్లామ్ స్పష్టం చేశారు. "ఒకవేళ నేను కూడా రాజీనామా చేయాల్సి వస్తే చివరి వ్యక్తిగానే వెళతాను" అని ఆయన తేల్చిచెప్పారు.శనివారం జరిగిన బోర్డు సమావేశం అనంతరం డైరెక్టర్లు సనియన్ తనీమ్, మెహ్రాబ్ అలం, ఫైయాజుర్ రహ్మాన్, మంజురుల్ అలం తమ పదవులకు రాజీనామా చేశారు. అంతకుముందే మరో ముగ్గురు కూడా వైదొలిగారు. దీంతో 25 మంది సభ్యులున్న బోర్డులో అస్థిరత ఏర్పడింది. ఈ పరిణామాలపై బీసీబీ అధ్యక్షుడు అమీనుల్ ఇస్లామ్ ఆదివారం స్పందించారు. తన బృందం నిజాయతీపరులతో కూడినదని, వారితోనే బంగ్లాదేశ్ క్రికెట్‌కు సేవ చేయాలనుకుంటున్నానని అన్నారు.గత ఏడాది జరిగిన బీసీబీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఎన్నికల ప్రక్రియలో తన ప్రమేయం పరిమితమని, రాజ్యాంగ ప్రకారమే నడుచుకున్నానని అమీనుల్ వివరణ ఇచ్చారు.మరోవైపు, క్రీడా మంత్రిత్వ శాఖ ఎన్నికల చెల్లుబాటుపై ప్రశ్నలు లేవనెత్తడం, టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనకపోవడం వంటి అంశాలు బోర్డుపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

# కోల్‌కతాలో అరుదైన ఘటన.. 6 కిలోల బరువుతో శిశువు జననం!

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో చోటుచేసుకున్న ఓ అరుదైన వైద్య ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.  ఓ మహిళ దాదాపు 6 కిలోల బరువున్న శిశువుకు జన్మనిచ్చింది. ఈ ఘటన వైద్యులనూ విస్మయానికి గురిచేసింది. సాధారణంగా నవజాత శిశువుల బరువు 2.5 కిలోల నుంచి 4.5 కిలోల మధ్య ఉంటుంది. కానీ, అందుకు భిన్నంగా ఇంత భారీ బరువుతో శిశువు పుట్టడం ప్రస్తుతం వైద్య వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.వివరాల్లోకి వెళితే.. కోల్‌కతాకు చెందిన 32 ఏళ్ల నాజియా పర్వీన్ అనే మహిళను ప్రసవం కోసం మార్చి 22న లేడీ డఫ్ఫరిన్ విక్టోరియా ఆసుపత్రిలో చేర్చారు. గైనకాలజిస్ట్ డాక్టర్ నివేదిత పాల్ పర్యవేక్షణలో ఆమెకు సిజేరియన్ ద్వారా ప్రసవం నిర్వహించారు. ఆ సమయంలో పుట్టిన శిశువు బరువు దాదాపు 6 కిలోలు ఉండటంతో వైద్య సిబ్బంది ఆశ్చర్యపోయారు. తల్లి అధిక బరువు, జన్యుపరమైన కారణాల వల్ల శిశువు ఇంత బరువుతో పుట్టి ఉండవచ్చని వైద్యులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.నాజియా పర్వీన్‌కు సుమారు పదేళ్ల క్రితం మొదటి సంతానం కలిగింది. అయితే, ఆ సమయంలో ఎలాంటి అసాధారణ పరిస్థితి లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్య పరిభాషలో ఈ పరిస్థితిని 'ఫీటల్ మ్యాక్రోసోమియా'గా పిలుస్తారు. గర్భధారణ సమయంలో తల్లికి డయాబెటిస్ ఉండటం కూడా దీనికి ఒక ప్రధాన కారణంగా భావిస్తారు. అయితే ఈ కేసులో కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు.ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారని, ముందుజాగ్రత్త చర్యగా వైద్యుల పర్యవేక్షణలో ఉంచామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

# గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు మరిన్ని విమాన సర్వీసులు

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

గల్ఫ్ ప్రాంతం నుంచి భారత్‌కు విమాన సర్వీసుల పరిస్థితి మెరుగుపడుతోంది. ఆదివారం ఒక్కరోజే యూఏఈ నుంచి 90 ప్రత్యేక విమానాలు భారత్‌కు చేరుకోనున్నాయని అధికారిక ప్రకటన వెల్లడించింది. సౌదీ అరేబియా, ఒమన్ నుంచి కూడా విమానాలు నడుస్తున్నాయి. ఖతార్ గగనతలం పాక్షికంగా తెరుచుకోవడంతో, అక్కడి నుంచి 8 నుంచి 10 విమానాలు వచ్చే అవకాశం ఉంది.కువైట్, బహ్రెయిన్ దేశాల్లో గగనతలాలను మూసివేసినప్పటికీ, సౌదీ అరేబియాలోని దమ్మామ్ మీదుగా ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా, ఇజ్రాయెల్ నుంచి ఈజిప్ట్, జోర్డాన్ మీదుగా, ఇరాక్ నుంచి జోర్డాన్, సౌదీ అరేబియా మీదుగా భారతీయులను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇరాన్ నుంచి ప్రయాణాలను ఆర్మేనియా, అజర్‌బైజాన్ ద్వారా సులభతరం చేస్తున్నారు.ఇటీవల ఒమన్ తీరంలో నౌకపై జరిగిన దాడిలో మరణించిన భారత నావికుడి పార్థివదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చారు. ఆయన కుటుంబానికి అవసరమైన అన్ని సహాయాలను అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మరోవైపు, ఇరాన్‌లో చిక్కుకుపోయిన 345 మంది భారత జాలర్లు శనివారం సురక్షితంగా చెన్నైకి చేరుకున్నారు.గల్ఫ్, పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులను విదేశాంగ మంత్రిత్వ శాఖ నిశితంగా గమనిస్తోంది. భారతీయుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను, 24 గంటల హెల్ప్‌లైన్లను నిర్వహిస్తున్నారు. అక్కడి భారత రాయబార కార్యాలయాలు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులు, నౌక సిబ్బందికి కూడా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్.. 100 ఎకరాల్లో టీజీఎస్ఆర్టీసీ ప్రణాళిక

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

హైదరాబాద్ నగర వ్యవస్థను ఆధునికీకరించే దిశగా టీజీఎస్ఆర్టీసీ కీలక అడుగు వేస్తోంది. జీడిమెట్ల సమీపంలోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగరంలోకి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సుల వల్ల తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ఈ టెర్మినల్‌ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం ఇటీవలే టీజీఎస్ఆర్టీసీకి 100 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ స్థలంలో అంతర్రాష్ట్ర, సిటీ బస్సుల కోసం వేర్వేరు టెర్మినల్స్ నిర్మించనున్నారు. ఇందులో భాగంగా సుమారు 30 ఎకరాలను అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల కోసం, మరో 20 ఎకరాల్లో ఆధునిక సౌకర్యాలు, షాపులతో కూడిన సిటీ బస్ టెర్మినల్ నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ఇక్కడి నుంచే నగరంలోని అన్ని ప్రాంతాలకు బస్సులు నడపనున్నారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 10 ఎకరాల్లో ఎలక్ట్రిక్ బస్సు డిపో, 15 ఎకరాల విస్తీర్ణంలో ఈవీ బస్సుల కోసం ప్రత్యేక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ బృహత్ ప్రణాళిక పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే హైదరాబాద్ శివారు ప్రాంతం నుంచి నగర రవాణా వ్యవస్థ మరింత పటిష్టం కానుంది.

# సినీ ఫక్కీలో తమ పైలట్ ను కాపాడుకున్న అమెరికా... రెస్క్యూ ఆపరేషన్ ఎలా సాగిందంటే...!

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

ఇరాన్ గడ్డపై అత్యంత సాహసోపేతమైన, ఉత్కంఠభరితమైన ఆపరేషన్ చేపట్టి, తమ వైమానిక దళ అధికారిని అమెరికా సైన్యం సురక్షితంగా రక్షించుకుంది. శత్రు దళాలు చుట్టుముడుతున్న వేళ, వ్యూహాత్మకంగా వ్యవహరించి తమ పైలట్ ను కాపాడుకున్న తీరు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. "అమెరికా సైనిక చరిత్రలోనే ఇది అత్యంత ధైర్యసాహసాలతో కూడిన రెస్క్యూ ఆపరేషన్" అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ప్రకటించారు.

## కూలిపోయిన యుద్ధ విమానం... మొదలైన ఉత్కంఠ

గత శుక్రవారం, దక్షిణ ఇరాన్‌లోని పర్వత ప్రాంతాల్లో అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాన్ని ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ కూల్చివేసింది. ప్రమాదాన్ని పసిగట్టిన విమానంలోని ఇద్దరు సిబ్బంది వెంటనే బయటకు దూకేశారు (ఎజెక్ట్ అయ్యారు). వీరిలో ఒకరిని అమెరికా దళాలు వెంటనే రక్షించగా, వెపన్స్ సిస్టమ్ ఆఫీసర్ (సెకండ్ పైలట్) ఆచూకీ లభించలేదు. కేవలం ఒక హ్యాండ్‌గన్‌తో అతడు 24 గంటలకు పైగా ఇరాన్ పర్వత ప్రాంతాల్లో ఒంటరిగా చిక్కుకుపోయాడు. అతడిని సజీవంగా పట్టుకునేందుకు ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (×=+జ) దళాలు, బసీజ్ ఫోర్స్‌లు, స్థానిక గిరిజన తెగలు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టడం ప్రారంభించాయి.

## సీఐఏ పక్కా ప్లాన్

ఈ క్లిష్ట సమయంలో అమెరికా గూఢచార సంస్థ 'సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ' (జ×యా) రంగంలోకి దిగి కీలక పాత్ర పోషించింది. తొలుత, గాయపడిన పైలట్ కచ్చితమైన లొకేషన్‌ను గుర్తించి పెంటగాన్‌కు సమాచారం అందించింది. ఆ తర్వాత, ఇరాన్ దళాల దృష్టి మళ్లించడానికి ఒక అద్భుతమైన వ్యూహం పన్నింది. అమెరికన్ అధికారిని భూమార్గంలో ఒక కాన్వాయ్‌లో సరిహద్దులు దాటిస్తున్నట్లు నకిలీ సమాచారాన్ని ఇరాన్ వర్గాలకు అందేలా చేసింది. దీంతో ఇరాన్ దళాలు ఆ కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని గాలింపును ఆ దిశగా మళ్లించాయి.

## నేవీ సీల్స్ రంగ ప్రవేశం... ఆపరేషన్ సాగిందిలా!

సీఐఏ పన్నిన వ్యూహంతో ఇరాన్ దళాలు తప్పుదారి పట్టగా, అసలు కార్యాచరణను అమెరికా అత్యంత నిష్ణాతులైన 'నేవీ సీల్స్' బృందం ప్రారంభించింది. డజన్ల కొద్దీ అమెరికా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించి రక్షణ కవచంలా నిలిచాయి. పర్వత ప్రాంతంలో దాక్కున్న అధికారిని నేవీ సీల్స్ బృందం సురక్షితంగా చేరుకుంది.

# ఆర్సీబీతో పోరు... టాస్ గెలిచిన చెన్నై



ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) మధ్య ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ తొలుత బ్యాటింగ్ చేయనుంది. ఈ సీజన్‌లో వరుసగా రెండో విజయంపై ఆర్సీబీ కన్నేయగా, పాయింట్ల ఖాతా తెరిచేందుకు ఐదుసార్లు ఛాంపియన్ అయిన సీఎస్కే పట్టుదలగా ఉంది.టాస్ గెలిచిన అనంతరం రుతురాజ్ మాట్లాడుతూ.. "ఇది హైస్కోరింగ్ మైదానం. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపిస్తోంది. అందుకే ఆర్సీబీని వీలైనంత తక్కువ స్కోరుకే కట్టడి చేయాలని చూస్తాం. ధోనీ నెమ్మదిగా కోలుకుంటున్నాడు, ఆడేందుకు సిద్ధమయ్యాక త్వరలోనే జట్టులోకి వస్తాడు," అని చెప్పాడు. మరోవైపు ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ మాట్లాడుతూ.. "మేము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నాం. కానీ పిచ్ గట్టిగా ఉండటంతో బ్యాటింగ్ చేయడం కూడా సంతోషంగానే ఉంది. గత మ్యాచ్‌లో మా వాళ్లు అద్భుతంగా ఆడారు, అదే జోరును కొనసాగిస్తాం," అని ధీమా వ్యక్తం చేశాడు. ఇరు జట్లు గత మ్యాచ్‌లో ఆడిన ఆటగాళ్లతోనే బరిలోకి దిగుతుండటం విశేషం.ఇప్పటివరకు ఈ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లలో చెన్నై 21-13తో ఆధిక్యంలో ఉంది. అయితే చిన్నస్వామి స్టేడియం విషయానికొస్తే ఆర్సీబీ 6-5తో స్వల్ప ఆధిక్యం కనబరుస్తోంది. పిచ్ నివేదిక ప్రకారం, ఈ మైదానంలో బౌండరీలు చిన్నవిగా ఉండటంతో బ్యాటర్లకు పండగేనని, కొత్త బంతితో తొలి ఓవర్లలో వికెట్లు తీయడం కీలకం కానుందని విశ్లేషకులు అంచనా వేశారు.చెన్నై సూపర్ కింగ్స్: సంజూ శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబే, ప్రశాంత్ వీర్, జామీ ఓవర్టన్, నూర్ అహ్మద్, అన్షుల్ కంబోజ్, మాట్ హెన్రీ, ఖలీల్ అహ్మద్.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: ఫిలిప్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, అభినందన్ సింగ్, జాకబ్ డఫీ.



# క్లాసెన్, నితీశ్ అద్భుత పోరాటం... గౌరవప్రద స్కోరు సాధించిన సన్ రైజర్స్

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పోరాడే స్కోరు సాధించింది. టాప్ ఆర్డర్ ఘోరంగా విఫలమైన చోట హెన్రిచ్ క్లాసెన్ (62), నితీశ్ కుమార్ రెడ్డి (56) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరి పోరాటంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది.టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు బౌలర్లు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. మహమ్మద్ షమీ తన పదునైన బౌలింగ్‌తో సన్‌రైజర్స్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కకావికలం చేశాడు. అభిషేక్ శర్మ (0), ట్రావిస్ హెడ్ (7)లను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత కెప్టెన్ ఇషాన్ కిషన్ (1), లియామ్ లివింగ్‌స్టోన్ (14) కూడా స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో సన్‌రైజర్స్ 26 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ దశలో క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరూ సంయమనంతో ఆడుతూనే, చెత్త బంతులను బౌండరీలకు తరలించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు ఏకంగా 116 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించింది. నితీశ్ రెడ్డి 33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 పరుగులు చేయగా, క్లాసెన్ 41 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 62 పరుగులు సాధించాడు. తొలి 10 ఓవర్లలో కేవలం 35 పరుగులే చేసిన సన్‌రైజర్స్... ఆ తర్వాత 10 ఓవర్లలో 121 పరుగులు చేసిందంటే ఆ క్రెడిట్ నితీశ్-క్లాసెన్ జోడీకే దక్కుతుంది.అయితే, వీరిద్దరూ ఔటయ్యాక చివరి ఓవర్లలో హైదరాబాద్ మళ్లీ వికెట్లు కోల్పోవడంతో 156 పరుగులతో సరిపెట్టుకుంది. లక్నో బౌలర్లలో మహమ్మద్ షమీ 4 ఓవర్లలో కేవలం 9 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టగా, అవేశ్ ఖాన్, ప్రిన్స్ యాదవ్ చెరో రెండు వికెట్లు తీశారు.






# లక్నో బౌలర్ల ధాటికి సన్‌రైజర్స్ విలవిల... టాపార్డర్ కుప్పకూలింది!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తడబడింది. సొంతగడ్డపై జరుగుతున్న ఈ మ్యాచ్‌లో లక్నో బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు సన్‌రైజర్స్ టాపార్డర్ కుప్పకూలింది. ఫలితంగా 8 ఓవర్లు ముగిసేసరికి కేవలం 29 పరుగులు మాత్రమే చేసి 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో టాస్ గెలిచిన లక్నో జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. కెప్టెన్ నిర్ణయం సరైందేనని నిరూపిస్తూ లక్నో బౌలర్లు ఆరంభం నుంచే వికెట్ల వేట కొనసాగించారు. స్టార్ పేసర్ మహమ్మద్ షమీ తన అద్భుత స్పెల్‌తో సన్‌రైజర్స్ బ్యాటింగ్ లైనప్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. ఓపెనర్లు అభిషేక్ శర్మ (0), ట్రావిస్ హెడ్ (7) ఇద్దరినీ షమీనే పెవిలియన్ చేర్చాడు.ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ ఇషాన్ కిషన్ (1) ప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌లో, దూకుడుగా ఆడే ప్రయత్నం చేసిన లియామ్ లివింగ్‌స్టోన్ (14) దిగ్వేశ్ సింగ్ రాఠీ బౌలింగ్‌లో ఔటయ్యారు. దీంతో సన్‌రైజర్స్ కష్టాలు మరింత పెరిగాయి. వరుస వికెట్లతో స్కోరు బోర్డు నత్తనడకన సాగింది. ప్రస్తుతం క్రీజులో హెన్రిచ్ క్లాసెన్ (4), నితీశ్ కుమార్ రెడ్డి (2) ఉన్నారు. జట్టును ఆదుకుని గౌరవప్రదమైన స్కోరు అందించాల్సిన బాధ్యత వీరిపై ఉంది..

# చివరి వరకు పోరాడిన సన్‌రైజర్స్... ఉత్కంఠ పోరులో లక్నో విజయం





సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వీరోచితంగా పోరాడినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ రిషభ్ పంత్ (68 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో లక్నోను గెలిపించాడు.157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నోకు మంచి ఆరంభం లభించింది. ఎయిడెన్ మార్క్రమ్ (45) వేగంగా ఆడాడు. అయితే, సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో మధ్యలో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురైంది. కానీ, ఒకవైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ రిషభ్ పంత్ చివరి వరకు క్రీజులో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. 50 బంతుల్లో 9 ఫోర్లతో 68 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆఖరి ఓవర్ లో లక్నో విజయానికి 9 పరుగులు కావాల్సి ఉండగా... పంత్ రెండు ఫోర్లు కొట్టడంతో స్కోరు సమం అయింది. 4 బంతుల్లో 1 పరుగు కావాల్సి ఉండగా... ఉనద్కట్ రెండు డాట్ బాల్స్ విసరడంతో ఉత్కంఠ పెరిగిపోయింది. మ్యాచ్ సూపర్ ఓవర్ కు దారితీస్తే బాగుండని సన్ రైజర్స్ అభిమానులు కోరుకున్నారు. అయితే, పంత్ మరో బౌండరీ కొట్టడంతో మ్యాచ్ సన్ రైజర్స్ చేజారింది. లక్నో 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సన్‌రైజర్స్ బౌలర్లలో హర్ష్ దూబే 2 వికెట్లు తీశాడు.అంతకుముందు, టాస్ గెలిచిన లక్నో బౌలింగ్ ఎంచుకుంది. మహమ్మద్ షమీ (2/9) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో సన్‌రైజర్స్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ట్రావిస్ హెడ్ (7), అభిషేక్ శర్మ (0), ఇషాన్ కిషన్ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో, పవర్ ప్లే ముగిసేసరికి రైజర్స్ 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ దశలో క్రీజులో కలిసిన హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 116 పరుగులు జోడించడంతో సన్‌రైజర్స్ కోలుకుంది. క్లాసెన్ 41 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 62 పరుగులు చేయగా, నితీశ్ రెడ్డి 33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 పరుగులు సాధించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది.

# అతడి కష్టం నాకే తెలుసు... రిషభ్ పంత్‌కు అండగా నిలిచిన యువరాజ్



టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న వికెట్ కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్‌కు అండగా నిలిచాడు. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) జట్టుకు కెప్టెన్‌గా ఉన్న పంత్.. ఇటీవల ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 9 బంతుల్లో కేవలం 7 పరుగులు మాత్రమే చేసి విఫలమవడంతో అతనిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో యువరాజ్ స్పందిస్తూ పంత్‌కు బాసటగా నిలిచాడు.స్పోర్ట్స్ తక్‌తో మాట్లాడుతూ యువరాజ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. "పంత్ ప్రాణాంతక ప్రమాదం నుంచి బయటపడ్డాడు. నేను కూడా అలాంటి అనుభవాన్నే ఎదుర్కొన్నాను. కాబట్టి అతని పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. ప్రస్తుతం అతని మానసిక స్థితి ఎలా ఉందో చాలా మందికి అర్థం చేసుకోవడం కష్టం" అని యువరాజ్ అభిప్రాయపడ్డాడు. పంత్ ఎదుర్కొంటున్న కష్టాలను సామాన్యులు అర్థం చేసుకోలేరని యువీ పేర్కొన్నాడు.గత రెండేళ్లుగా పంత్ ఎన్నో ఇబ్బందులు పడ్డాడని, కారు ప్రమాదం తర్వాత పలు గాయాలు, సైడ్ స్ట్రెయిన్, ఫుట్ ఫ్రాక్చర్ వంటివి అతడిని వేధించాయని యువరాజ్ తెలిపాడు. వీటివల్ల తన రిథమ్, ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నాయని వివరించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌కు ముందు యువరాజ్ వద్ద పంత్ శిక్షణ తీసుకున్నాడు. ఆ సమయంలో తమ మధ్య కీలక సంభాషణలు జరిగాయని అన్నాడు. పంత్ తన తప్పుల నుంచి నేర్చుకుని, ముఖ్యంగా వైట్-బాల్ క్రికెట్‌లో రాణించాలని తపనతో ఉన్నాడని యువీ చెప్పాడు.కాగా, లక్నో సూపర్ జెయింట్స్ జట్టు నేడు ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా పంత్ తిరిగి ఫామ్ అందుకుంటాడని అతని అభిమానులు ఆశిస్తున్నారు.



# ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో భువనేశ్వర్ కుమార్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో ఓ అరుదైన మైలురాయికి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పేసర్ భువనేశ్వర్ కుమార్ అడుగు దూరంలో నిలిచాడు. ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో అతను ఒక్క వికెట్ తీస్తే, ఐపీఎల్‌లో 200 వికెట్లు పూర్తి చేసుకున్న రెండో బౌలర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. అంతేకాకుండా, ఈ ఘనత సాధించిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా నిలిచి ఓ ప్రత్యేక రికార్డును తన ఖాతాలో వేసుకోనున్నాడు. ప్రస్తుతం భువనేశ్వర్ 191 మ్యాచుల్లో 199 వికెట్లతో ఈ మైలురాయికి అత్యంత చేరువలో ఉన్నాడు.ఇప్పటివరకు ఐపీఎల్‌లో 200 వికెట్ల మార్కును కేవలం లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ మాత్రమే అందుకున్నాడు. చాహల్ 176 మ్యాచ్‌లలో 224 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 2024 సీజన్‌లో తన 153వ మ్యాచ్‌లోనే చాహల్ ఈ ఘనతను సాధించాడు. ఇప్పుడు భువనేశ్వర్ ఈ ఎలైట్ క్లబ్‌లో చేరడానికి సిద్ధమయ్యాడు. అతని కెరీర్ 2009లో ఆర్సీబీతోనే ప్రారంభమైనప్పటికీ, తొలి రెండు సీజన్లలో ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. ఆ తర్వాత పుణె వారియర్స్ తరఫున మూడు సీజన్లు ఆడినా పెద్దగా రాణించలేకపోయాడు.అయితే, 2014లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అతడిని కొనుగోలు చేయడంతో భువనేశ్వర్ దశ తిరిగింది. అనతికాలంలోనే జట్టు బౌలింగ్ విభాగానికి వెన్నెముకగా మారాడు. పవర్‌ప్లే, డెత్ ఓవర్లలో కీలక బౌలర్‌గా ఎదిగాడు. సన్‌రైజర్స్ తరఫున ఆడిన తొలి నాలుగు సీజన్లలో ప్రతీసారి 18కి పైగా వికెట్లు పడగొట్టాడు. 2016, 2017 సంవత్సరాల్లో వరుసగా రెండుసార్లు 'పర్పుల్ క్యాప్' గెలుచుకున్నాడు. 2016లో సన్‌రైజర్స్ తమ ఏకైక టైటిల్ గెలవడంలో భువీ కీలక పాత్ర పోషించాడు. ఇప్పటికీ సన్‌రైజర్స్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అతడే ఉన్నాడు.2025లో తిరిగి తన పాత జట్టు ఆర్సీబీ గూటికి చేరిన భువనేశ్వర్, గతేడాది అద్భుతంగా రాణించాడు. 14 మ్యాచ్‌లలో 17 వికెట్లు తీశాడు. ముఖ్యంగా, పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 17వ ఓవర్లో రెండు కీలక వికెట్లు తీసి ఆర్సీబీ తొలిసారిగా ట్రోఫీని ముద్దాడటంలో నిర్ణయాత్మక పాత్ర పోషించాడు. ప్రస్తుతం హేజిల్‌వుడ్ అందుబాటులో లేకపోవడంతో ఆర్సీబీ బౌలింగ్ భారాన్ని భువీ మోస్తున్నాడు. ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్లు విధ్వంసం సృష్టిస్తున్నా, భువనేశ్వర్ పొదుపుగా బౌలింగ్ చేసి కేవలం 31 పరుగులే ఇచ్చి తన సత్తా చాటాడు. ఇప్పుడు చిన్నస్వామి స్టేడియంలో చెన్నైపై ఈ అరుదైన రికార్డును అందుకుంటాడని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# భారత టెస్టు జట్టు ప్రక్షాళనకు బీసీసీఐ మాస్టర్ ప్లాన్.. లక్ష్మణ్ నేతృత్వంలో 64 మందితో టాలెంట్ హంట్

2024, 2025 సంవత్సరాల్లో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లతో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లలో భారత జట్టు ఐదు మ్యాచ్‌లలో ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుపై దృష్టి సారించి, జట్టును బలోపేతం చేసేందుకు ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. వీవీఎస్ లక్ష్మణ్ నేతృత్వంలోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఈ మేరకు ఒక పటిష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. రాబోయే దశాబ్దానికి అవసరమైన నాణ్యమైన రెడ్ బాల్ క్రికెటర్లను తయారు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.ఇందులో భాగంగా జూన్-జులై మాసాల్లో 25 ఏళ్లలోపు వయసున్న 64 మంది యువ ప్రతిభావంతులతో ఒక ఇంట్రా-సీఓఈ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే వంటి 'జెన్-జీ' తరం ఆటగాళ్లు పాల్గొంటారు.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656